ప్రజాశక్తి

శనివారం 29 నవంబర్ 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

'దిత్వా'తో రైతుల్లో ఆందోళన

- తుపాను నుండి ధాన్యాన్ని కాపాడుకోవడానికి పరుగులు
- వరి కోత యంత్రాలకు డిమాండ్

ప్రజాశక్తి - వీరులపాడు, పెనుగంచిప్రోలు, కంకిపాడు, కలెక్టరేట్ : 'దిత్వా' తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వరి రైతులకు తుపాను కంటిమీద కునికి లేకుండా చేస్తోంది. పంటలు చేతికొస్తున్న తరుణంలో తమను దెబ్బతీస్తుందేమోనని భయపడుతున్నారు. కోతకు వచ్చిన వరి పంట, మొక్కజొన్న కోతలు ప్రారంభించాలా వద్దా అన్న సందిగ్ధంలో ఉన్నారు. తుపానుకు భయపడి కోతలను వాయిదా వేసుకుంటున్నారు. అయితే అదును దాడితే గింజలు రాలిపోతాయని ఆందోళన చెందుతున్న కొంత మంది రైతులు ధైర్యం చేసి యంత్రాల సాయంతో కోతలు కోయించి అయినకాడికి అమ్ముకుంటున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ నియోజవర్గం వీరులపాడు, కంచికచర్ల, చందర్లపాడు, నందిగామ మండలాల్లో చెరువులు, బావులు, మున్నేరు ఎత్తిపోతల పథకాల కింద సుమారుగా 20 వేల హెక్టార్లలో వరి సాగుచేశారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోనూ రైతులు అధికంగా వరిని సాగుచేశారు. ధాన్యానికి సాధారణ రకం 100 కిలోల బస్తాకు 2,369 రూపాయలు, 75 కిలోల బస్తాకు 1,777 రూపాయలుగా ధరను ప్రభుత్వం నిర్ణయించింది. ఏగాడు రకానికి 100 కిలోల బస్తా 2,389 రూపాయలు, 75 కిలోల బస్తా 1,792 రూపాయలుగా నిర్ణయించింది. అయితే తేమశాతం 17లోపు ఉండాలని నిబంధన విధించింది. మొంథా తుపానుకు ధాన్యం తడవటంతో తేమశాతం 20కిపైగా ఉంటోంది. దీంతో రైతు సేవా కేంద్రాల్లో తమ ధాన్యాన్ని కొనే పరిస్థితిలేదని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు ధాన్యం ఆరబోసి సేవా కేంద్రాల (మిగతా 2లో)

ఎన్‌టిఆర్ జిల్లా వత్సవాయి మండలంలో ధాన్యంపై పరదాలు కప్పిన రైతులు

ఎన్‌టిఆర్ జిల్లా వీరులపాడు మండలం జయంతి గ్రామంలో వరి నూర్పిళ్లలో యంత్రం

వరి రైతులకు అన్నీ అందుబాటులో ఉంచాలి

కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్

తుపాను హెచ్చరికల నేపథ్యంలో వరి కోత మిషన్లు రైతులకు అందుబాటులో ఉంచాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా కంకిపాడు మండలం పునాదిపాడు, ఉప్పులూరు, జగన్నాధపురం, గొడవర్రు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. జిపిఎస్ లేని లారీలకు ధాన్య రవాణాకు అవకాశం కల్పించాలన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి ధాన్యం గింజనూ యుద్ధ ప్రతిపాదికన కొనుగోలు చేయాలని కోరారు. రైతులకు అవసరమైన గోనె సంచులు, లారీలు, పరదాలు సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం రైస్ మిల్లులకు తరలించాలని కోరారు. కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కల్లాల్లోనే ధాన్యం విక్రయం

సుధాకర్, రైతు, జయంతి గ్రామం

ఇటీవల వచ్చిన తుపాను కారణంగా వరి పంట నేల వాలింది. దీంతో ఎకరానికి 20 క్వింటాళ్లలోపే దిగుబడి వస్తుంది. గతంలో 40 కింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. తుపాను హెచ్చరిక నేపథ్యంలో కోతలు కోసి కల్లాల్లోనే ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. క్వింటా రూ.1525లకు కొంటున్నారు. ప్రభుత్వం తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి.

యంత్రాలకు రెట్టింపు ధరలు వసూలు

కోటేరు సునీల్ రెడ్డి, రైతు, జయంతి

నాలుగు ఎకరాల్లో వరి సాగుచేశా. మొంథా తుపాను కారణంగా వరి పంట నేలకొరిగింది. గతం కంటే దిగబడి తక్కువ వస్తుంది. ప్రస్తుతం తుపాను ప్రభావం వల్ల యంత్రాలు, కూలీలు దొరకటం లేదు. యంత్రాల యజమానులు రెట్టింపు ధరలు వసూలు చేస్తున్నారు. ఎన్ని కష్టాలు పడినా రైతులకు ప్రయోజనం ఉండటం లేదు.పరదాలు, గోనె సంచులు, లారీలు అందుబాటులో ఉంచాలి.

రెండో విడత భూ సమీకరణకు

గ్రీన్ సిగ్నల్

- రాజధాని విస్తరణకు వేగంగా అడుగులు
- తొలిదశలో 16,666 ఎకరాలకు మంత్రివర్గం ఆమోదం
- త్వరలో నోటిఫికేషన్‌కు అధికారుల కసరత్తు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతి విస్తరణలో భాగంగా మలివిడత భూ సమీకరణకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈమేరకు శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మలి విడతలో తొలుత 16,666 ఎకరాల సమీకరణకు ఆమోదం తెలిపారు. ప్రధానంగా తెలంగాణాలోని ఎర్రుపాలెం నుంచి గుంటూరు జిల్లా నంబూరు వరకు ఏర్పాటు కానున్న అమరావతి రైల్వే లైను, వడ్డమాను వద్ద ప్రధాన రైల్వేస్టేషన్, అమరావతిలో స్పోర్టు సిటీ, అటర్‌రింగ్ రోడ్డు, గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం, స్మార్టు సిటీ నిర్మాణం నిమిత్తం 16,666 ఎకరాల భూములు అవసరం అవుతాయని సిఆర్‌డిఎ అధికారులు చేసిన ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతిలో ఇంటిగ్రేటేడ్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ నిర్మిస్తామని మునిసిపల్ మంత్రి పి.నారాయణ రాజధానిలో మీడియాకు తెలిపారు. తొలుత 44 వేల ఎకరాల్లో మలి విడత భూ సమీకరణ చేయాలని నిర్ణయం తీసుకున్నా ఇటీవల 34 వేల ఎకరాల సమీకరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2015 నుంచి 2018 వరకు తీసుకున్న 34 వేల ఎకరాలతోపాటు మరో 16 వేల ఎకరాలు ప్రభుత్వ భూములు కూడా సిఆర్‌డిఎ తమ అధీనంలోకి తీసుకుంది. తాజాగా మరో 34 వేల ఎకరాలు మలివిడతలో సమీకరణకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇందులో తొలిదశలో 16,666 ఎకరాలు తీసుకోనున్నారు. ఇందుకుగాను ఏడు గ్రామాలను ఎంపిక చేశారు. తుళ్లూరు మండలంలో మొదటి విడత సమీకరణ నుంచి మినహాయించిన వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి గ్రామాలతోపాటు పర్యాటక కేంద్రం అమరావతి మండలంలో మరో నాలుగు గ్రామాలను ఎంపిక చేశారు. అమరావతి మండలం వైకుంఠపురంలో 3,361 ఎకరాలు, పెదమద్దూరులో 1,145 ఎకరాలు, ఎండ్రాయిలో 2,166 ఎకరాలు, కర్లపూడిలో 2,944 ఎకరాలు తీసుకోనున్నారు. తుళ్లూరు మండలం వడ్డమానులో 1,913 ఎకరాలు, హరిశ్చంద్రపురంలో 2,418 ఎకరాలు, పెదపరిమిలో 6,513 ఎకరాలు కలిపి మొత్తం 20,494 ఎకరాలు సిఆర్‌డిఎ భూ సమీకరణ చేయనుంది. రైతుల నుంచి 16,666 ఎకరాలు, ప్రభుత్వ అసైన్డు భూములు 3,828 ఎకరాలు ఉన్నాయని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం సమీకరిస్తున్న ఏడు గ్రామాల్లో ఇప్పటికే గ్రామసభలను నిర్వహించారు. తుళ్లూరు మండలంలోని మూడు గ్రామాల్లో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, అమరావతి మండలంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గ్రామ సభలను నిర్వహించి రైతులను ఒప్పించారు. తొలుత సానుకూలంగా ఉన్నగ్రామాలను సమీకరణకు ఎంపిక చేశారు. అమరావతి, తాడికొండ, పెదకూరపాడు మండలాల్లో వ్యతిరేకత వ్యక్తం చేసిన గ్రామాలను మలివిడతలోనే రెండో దశలో భూ సమీకరణ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. తొలుత ఏడు గ్రామాల్లో భూ సమీకరణకు త్వరలో నోటిఫికేషన్ విడుదల కానుందని అధికార వర్గాలు తెలిపాయి. అమరావతి, పెదకూరపాడు మండలాల్లో అటర్‌రింగ్ రోడ్డు కోసం భూ సేకరణ ద్వారా 9 గ్రామాల్లో 1173 ఎకరాలు తీసుకోవాలని జాతీయ రహదారుల అథారిటీ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేయడం గమనార్హం.

వైకుంఠపురం గ్రామం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - నందిగామ, జగ్గయ్యపేట : ఎన్‌టిఆర్ జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనలు గురువారం అర్థరాత్రి నందిగామ, చిల్లకల్లు పోలీసుస్టేషన్ల పరిధిలో జరిగాయి. నందిగామ శివారు అనాసాగరం వద్ద జాతీయ రహదారిపై గురువారం అర్థరాత్రి జగ్గయ్యపేట నుండి అవనిగడ్డకు సిమెంట్ లోడుతో లారీ వెళుతోంది. రన్నింగ్‌లో ఉండగా, లారీ టైరు పలిగింది. దీంతో వెనుకగా వస్తున్న కారు దానిని ఢీకొట్టింది. ఈ ఘటనలో హైదరాబాద్‌లో ఇఎ సాఫ్ట్‌వేర్ టీమ్ సోల్యుషన్స్ అనే కంపెనీ నడుపుతున్న చంద్రశేఖర్ (45) అక్కడికక్కడే మరణించారు. కారు డ్రైవర్ యలమంచిలి జగదీష్, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కారు నుజ్జునుజ్జయింది. విజయవాడలో బంధువుల వివాహానికి వెళుతున్న క్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు ఆటోనగర్ వద్ద జాతీయ రహదారిపై ఆటో బోల్తాపడి ఒకరు మరణించగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. జగ్గయ్యపేట మండలం గౌరవరం గ్రామంలో ఓ ప్రైవేటు కార్యక్రమం ముగించుకుని తిరిగి స్వగ్రామం తెలంగాణా రాష్ట్ర కోదాడ మండలం కొమరబండ గ్రామానికి ఆటోలో వెళుతుండగా అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో నంబర్ల శ్రీను (54), వన్నె వెంకటరెడ్డి, వెంకట రమణ తీవ్రంగా గాయపడ్డారు. శ్రీనును ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. వెంకట్ రెడ్డి, వెంకటరమణలను జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిల్లకల్లు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నందిగామ శివారు అనాసాగరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజునుజ్జయిన కారు

అలరించిన నాటక ప్రదర్శనలు

విజయవాడ : "గుమ్మడి జయరాజు కళాపీఠం" వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది గుమ్మడి రత్నశేఖర్ అష్టమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం రాత్రి గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై మూడు నాటక ప్రదర్శనలు జరిగాయి. శ్రీదేవి నాట్యమండలి (ఉయ్యూరు) కొమ్మూరు నాగేశ్వరరావు శిష్య బందంచే "బాలనాగమ్మ" (మాయల ఫకీర్ - సంగుసేను)లో ఫకీర్ గా మరీదు వెంకటరమణ, సంగుగా లక్ష్మీశ్రీ (జగ్గయ్యపేట) ఆకట్టుకున్నారు. "చింతామణి" నాటకం (భవానీ లవ్ సీన్)లో భవానీగా పి.కోటేశ్వరరావు, చింతామణిగా లక్ష్మీశ్రీ (జగ్గయ్యపేట)ల నటన అలరించింది. "సత్యహరిశ్చంద్ర" (వారణాసి సీను)లో హరిశ్చంద్రుడుగా పావులూరి పాములు, చంద్రమతిగా నాగలక్ష్మి (మచిలీపట్నం), నక్షత్రకుడిగా కడవకొల్లు బాబూరావు, కాలకౌశికుడిగా మరీదు వెంకటరమణ, శిష్యుడుగా ఈగ నాగేశ్వరరావు, లోహితుడుగా మాస్టర్ వేణు తమ పాత్రలకు న్యాయం చేశారు. ఈ సందర్భంగా హార్మోనిస్టులు చింతలపూడి నాగేశ్వరరావు, ఎం.వాసుదేవరావుల కు శిష్యబందం ఆత్మీయ సత్కారం చేసింది. గుమ్మడి విజయ్ కుమార్, అన్వేష్, జీవన్ కుమార్, కె.నాగేశ్వరరావు, మోత్రు ఆంథోని, దమ్ము సాల్మన్ రాజ్ తదితరులు పర్యవేక్షించారు.

కలిసి పాడుదాం...

విజయవాడ : గాంధీనగర్ ఆశీష్ స్టూడియోస్ లో శుక్రవారం రాత్రి "కలసి పాడుదాం - 28" 'అందరూ పాడాలి.. అందరితో పాడాలి' మకుటంతో తెలుగు, హిందీ సినీ సంగీత కచేరీ జరిగింది. "నంబర్ వన్" దినపత్రిక సౌజన్యంతో... గాయకుడు, వ్యాఖ్యాత బాలాజీకుమార్ నిర్వహణలో ఔత్సాహిక గాయనీ గాయకులు సీతాదేవి, వడ్డాది సూర్య కామేశ్వరి, మీనాకుమారి, పద్మజ, రామానుజాచార్యులు, సువర్ణలక్ష్మి, ఎం.ఎస్.రామారావు తదితరులు పాడిన తెలుగు, హిందీ సినీ పాటలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. స్టూడియోస్ అధినేత సూర్య 'ట్రాక్స్' సమకూర్చారు.

నందిత గాత్ర కచేరీ అదరహో

విజయవాడ : సంగీతం అంటే చెవి కోసుకునే వారిని నందిత కణ్ణన్ గాత్ర కచేరీ ఉర్రూతలూగించింది. శ్రీ సద్గురు సంగీత సభ 32వ వార్షిక సంగీత మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఐదో రోజు స్థానిక దుర్గాపురంలోని శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నత్య కళాశాల ఆవరణలో గాత్ర కచేరీ జరిగింది. అతి పిన్న వయసు నుండీ సంగీత సాధన చేస్తున్న నందిత.. మద్రాస్ అకాడమీ అవార్డు అందుకునే స్థాయికి ఎదగడం విశేషం. తమిళనాడు, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన నగరాల్లో ఎన్నో కచేరీలిచ్చి పండిత పామరుల ప్రశంసలందుకుంటున్న నందిత అద్భుత గాత్రానికి పి.నందకుమార్ (వయోలిన్), కె.అరవింద్ (మదంగం), ఎస్.హనుమంతరావు (ఘటం) సహకారం- ప్రేక్షకులు తన్మయులై కార్యక్రమాన్ని ఆద్యంతం ఆస్వాదించేలా చేసింది. సుమసాయక... (వర్ణం.. కాపి రాగం.. త్రిశ్రఏక తాళం.. రచన స్వాతి తిరునాళ్), సనాతన... (ఫలమంజరి రాగం.. ఆది తాళం.. రచన త్యాగరాజు), బంగారు కామాక్షి... వరాళి రాగం.. మిశ్రచాపు తాళం.. రచన శ్యామశాస్త్రి), చతుర్దశ రాగమాలిక - 14 రాగాలమాలిక.. ఆది తాళం.. రచన ముత్తుస్వామి దీక్షితార్) ఇత్యాది కీర్తనలను నందిత ఆలపిస్తుంటే అలా అలా ఆనందించడం ప్రేక్షకులవంతైంది. కార్యక్రమం ముగింపులో కళాకారుల్ని "సభ" బాధ్యులు ప్రకాష్, హరిప్రసాద్, గౌరీనాథ్, అంజనీకుమార్, మురళీకష్ణ తదితరులు సన్మానించారు.

'దిత్వా'తో రైతుల్లో ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

వద్దకు తీసుకెళ్లేలోపే వర్షం పడితే దారుణంగా నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు. అందుకే అయినకాడికి ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నామని చెబుతున్నారు. తేమశాతంతో సంబంధం లేకుండా సాంబమసూరి రకం ధాన్యం 75 కిలోల బస్తా రూ.1500 నుంచి రూ.1525 వరకు, లావులు అంకురు హెచ్ఎంటి రకాలైతే రూ.1700లకు ప్రైవేటువ్యాపారులు అడుతున్నారు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులవైపు మొగ్గుతున్నారు.

యంత్రాలు, కూలీల కొరత

వాతావరణం మబ్బులు పట్టి ఉన్నప్పటికీ చాలామంది రైతులు కోత కోసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే వరి కోత యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల వరి పంట నేల వాలింది. మళ్లీ వర్షాలు పడితే కోతకు సిద్ధంగా ఉన్న పంట మొత్తం నేల వాలిపోవడంతోపాటు గింజ రాలిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కూలీల కొరతతో వరి కోత యంత్రాలకు డిమాండ్ పెరగటంతో యంత్రాల యజమానులు అధికంగా వసూలు చేస్తున్నారు. రైతుల పరిస్థితిని ఆసరా చేసుకుని రెండు మూడు వేలకు మించి గంటకు వెయ్యి రూపాయలు అదనంగా తీసుకుంటున్నారు. కొందరు రైతులు ధైర్యంతో యంత్రాలతో కోత పూర్తి చేస్తున్నారు. వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటుండడంతో కోసిన ధాన్యాన్ని ఆరబెట్టాల్సి ఉన్నా వాతావరణంలో మార్పులతో కల్లాల్లోనే కుప్పలు పోసి బస్తాలకు ఎత్తి అమ్మకానికి సిద్ధం చేసుకుంటున్నారు. గిట్టుబాటు ధర వస్తుందన్న ఆశలు వదులుకొని దళారులకు తెగనమ్ముకుంటున్నారు. దళారులు అందిన కాడికి దండుకుంటున్నారు. కొందరు రైతులు తమ పంటను కాపాడుకోవడానికి పట్టాలను సిద్ధం చేసుకుంటున్నారు.

అలరించిన సరాగాలు

విజయవాడ : "పి ఎస్ ఆర్ ఫ్రెండ్స్ సరాగాలు" పేరుతో శుక్రవారం రాత్రి గాంధీనగర్ వి.హెచ్. గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి జరిగింది. గంగా మాస్టార్ స్మృతులతో.. ప్రముఖ గాయకుడు పసుపులేటి శ్రీనివాసరావు నిర్వహణలో జరిగిన కచేరీలో సుమలత, కల్పన, లక్ష్మణ్ నాయక్ (వ్యాఖ్యాత), గోవింద్, శిరోమణి రావు, ఎస్.ఎస్.శర్మ, వల్లూరు రాము, రజని, వాసు, ఎం.శ్రీనివాసరావు, రాయరాజు తదితర ఔత్సాహిక గాయనీ గాయకులు పాడిన ఆయా సినిమాల్లోని పాటలు ప్రేక్షకుల్ని రంజింపజేశాయి. వీరభద్రరావు, డేవిడ్ రాజు, చిట్టిబాబు, జయప్రభు, జోషి, కారుమంచి రాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్పు/సవరణ

నేను తమిర వెంకటలక్ష్మి, W/o. తమిర రవికిరణ్, నివాసం డోర్.నెం.22-15/1-88-19, భానునగర్, సిమెంట్ రోడ్డు, సత్యనారాయణపురం, విజయవాడ.

ప్రస్తుతం నా ఆధార్‌లో నా పేరు తమిర వెంకటలక్ష్మి అని నమోదు కాబడినది. ఇప్పుడు పేరు మార్పు/సవరణ చేయగా **ఖాసిమ్ వేదాన్షి**, D/o. **ఖాసిమ్ సత్యనారాయణ**, **(KASSIM VEDHANSHI, D/o. KASSIM SATYANARAYANA)** గా మార్పు చేయుట జరుగుతుంది. నేటి నుండి నా పేరు **ఖాసిమ్ వేదాన్షి** గా పిలవబడును. ఆధార్ లో మార్పుకొరకు.

CHANGE OF NAME

I, **NAGA MAHAPADMAJA KURMA** (Old Name), W/o. Busam Kota Venkata Syamala Rao, R/o. D.No. 9-272/1, SER Center, Excise Office Road, Prasadampadu, Vijayawada (Rural), Krishna Dist. - 521 108, A.P. I, declare that I, have changed my name as **BUSAM NAGA PADMAJA** (New name). Hereafter my name is known & called as **BUSAM NAGA PADMAJA.**

CHANGE OF NAME

I, KANAMARLAPUDI BULLI MASTAN (old name) S/o KANAMARLAPUDI VEERARAGHAVIAH, resident of D.No: 2-99, Koduru, Krishna, AP 521328.

I have changed my name as **Kanamarlapudi Bullimastan Rao** (New Name) S/o **Kanamarlapudi Veeraraghaviah**, Here After my name is known as **Kanamarlapudi Bullimastan Rao** (New Name), S/o **kanamarlapudi Veeraraghaviah**

CHANGE OF SURNAME & NAME

I, **VEMULAPALLI VENKATA VIJAYA LAKSHMI** W/o **VEMULAPALLI NARASIMHARAO** R/o D.No. 3-59-A, Thotlavalluru (P.O. & Mdl.), Krishna District - 521163. I have changed my name & surname "**NIDAMANOORI VENKATA VIJAYALAXMI**". to "**VEMULAPALLI VENKATA VIJAYA LAKSHMI**". Hereafter my name is known as "**VEMULAPALLI VENKATA VIJAYA LAKSHMI**".

మహారాజశ్రీ 3వ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజనల్) కోర్టు :: విజయవాడ
O.S.No. 126/2024

మధ్య
కొల్లూరి ప్రేమ మూర్తి ...వాది
మరియు
కొల్లూరి కరుణా కుమారి మరియు ఇతరులు ...ప్రతివాదులు

ప్రతివాది నెం:2
కె. ప్రశాంతి, భర్త: పరసా హెరాల్డ్ భాస్కర్, న్యూ డో.నెం. 21-75, పాత డో.నెం.9-137, యాదవుల బజార్, ప్రసాదంపాడు గ్రామం, విజయవాడ రూరల్, కృష్ణా డిస్ట్రిక్ట్.

ప్రతివాది నెం:3
మట్టే సౌమ్య, భర్త: శ్రీధర్, క్రిస్టియన్, వయస్సు: 37 సం॥లు, డో.నెం. 4515-2/3, పడవల రేవ్, గుణదల, విజయవాడ.

ఇందలి పైన తెలిపిన కేసులో మీ ఇరువురు 2,3 ప్రతివాదులుగా ఉన్నారు. సదరు కేసు నిమిత్తం మీరు కోర్టు నందు హాజరై నిమిత్తం ది. 05-12-2025వ తేదీన పై తెలిపిన కోర్టు నందు వాయిదా వేసి ఉన్నారు. కావున ప్రతి వాదులు అయిన మీరు సదరు వాయిదా నాడు ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని, న్యాయవాది గారి ద్వారా గాని హాజరై పైన తెలిపిన కేసులో మీ ఆక్షేపణలు తెలుపగలరు. అట్లు కాని పక్షంలో పై కేసును మీ పరోక్షము నందు విచారించి తీర్మానంపబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం //
ఇట్లు
వి. లక్ష్మీనారాయణ, అడ్వకేట్
29-13-18, కాళేశ్వరరావు రోడ్డు,
సూర్యారావు పేట, విజయవాడ-2,
సెల్ నెం. 9848536066
వాయిదా తేది: 05-12-2025

మహారాజశ్రీ యలమంచిలి ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No. 82 / 2023

<u>బిట్వీన్:</u>
సోమిరెడ్డి వెంకట అప్పల సత్య సన్యాశి నూకరాజు . . . వాది
<u>అండ్:</u>
పిన్నింటి శ్రీనివాసరావు . . . ప్రతివాది
<u>టు:</u>
<u>ప్రతివాది:</u>
పిన్నింటి శ్రీనివాసరావు, తండ్రి లేటు రాముడు సాకేను డోరు నెం. 9-166-2ఎ, బలరాముని పేట, మచిలీపట్నం గ్రామము మచిలీపట్నం మండలము, కృష్ణా జిల్లా.

దావా పరిహారం నిమిత్తం మీ మీద పైన వివరించిన వాజ్యము వాది తెప్పించినందు వల్ల సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పగా అందువలన **<u>2025వ సం॥ 12వ నెల 18వ తారీఖున పగలు 10-30 గంటలకు</u>** స్వతహాగా లేక సరి అయిన భోగట్టా యివ్వబడిన వకీలు గారి ద్వారాగా లేక సరిఅయిన ఏజంటు మూలముగా ఈ కోర్టులో హాజరయ్యేటట్లు యిందువలన మీకు ఆజ్ఞాపించడమైనది. మీ ప్రతివాదమునకు ఆధారముగా వుద్దేశించి యుండే దస్తావేజులన్నింటిని నీ యొక్క స్టేట్‌మెంటుతో సహా ఆరోజున హాజరు పరచుటకు మీకు ఉత్తరువు చేయడమైనది. పైన చెప్పబడిన దినమందు మీరు హాజరు కాకుండా తప్పిపోయిన యెడల మీ పరోక్ష మందు పై వాజ్యమును విమర్శన చేసి తీర్మానించుటమగునని, మీరు తెలుసుకోవలసినది.

(శ్రీకోర్టు వారి ఉత్తరువుతో)
వాడపల్లి అన్నపూర్ణయ్య
అడ్వకేట్, యలమంచిలి
అనకాపల్లి జిల్లా.
యలమంచిలి
తే:28-11-2025 సెల్: 9247159149

మహారాజశ్రీ 3వ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజనల్) కోర్టు :: విజయవాద
I.A. No. 488/2024 in O.S.No. 126/2024

మధ్య
కొల్లూరి ప్రేమ మూర్తి ...వాది
మరియు
కొల్లూరి కరుణా కుమారి మరియు ఇతరులు ...ప్రతివాదులు

ప్రతివాది నెం:2
కె. ప్రశాంతి, భర్త: పరసా హెరాల్డ్ భాస్కర్, న్యూ డో.నెం. 21-75, పాత డో.నెం.9-137, యాదవుల బజార్, ప్రసాదంపాడు గ్రామం, విజయవాడ రూరల్, కృష్ణా డిస్ట్రిక్ట్.

ప్రతివాది నెం:3
మట్టే సౌమ్య, భర్త: శ్రీధర్, క్రిస్టియన్, వయస్సు: 37 సం॥లు, డో.నెం. 4515-2/3, పడవల రేవ్, గుణదల, విజయవాడ.

ఇందలి పైన తెలిపిన కేసులో మీ ఇరువురు 2,3 ప్రతివాదులుగా ఉన్నారు. సదరు కేసు నిమిత్తం మీరు కోర్టు నందు హాజరై నిమిత్తం ది. 05-12-2025వ తేదీన పై తెలిపిన కోర్టు నందు వాయిదా వేసి ఉన్నారు. కావున ప్రతి వాదులు అయిన మీరు సదరు వాయిదా నాడు ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని, న్యాయవాది గారి ద్వారా గాని హాజరై పైన తెలిపిన కేసులో మీ ఆక్షేపణలు తెలుపగలరు. అట్లు కాని పక్షంలో పై కేసును మీ పరోక్షము నందు విచారించి తీర్మానంపబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం //
ఇట్లు
వి. లక్ష్మీనారాయణ, అడ్వకేట్
29-13-18, కాళేశ్వరరావు రోడ్డు,
సూర్యారావు పేట, విజయవాడ-2,
సెల్ నెం. 9848536066
వాయిదా తేది: 05-12-2025

ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవి

వత్సవాయి మండలం మాచినేనిపాలెం గ్రామానికి చెందిన ధారావత్ సక్రు తండ్రి రామకోటికి సంబంధించిన మాచినేనిపాలెం గ్రామరెవెన్యూ పరిధి లోని ఆర్ఎస్ నెంబర్ 77/1లో య1.39 సెంట్లకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు మాచినేనిపాలెం నుండి వత్సవాయి గ్రామానికి నవంబర్ 25, 2025 ఆటోలో వెళ్ళుచుండగా డాక్యుమెంట్లు గల సంచి మార్గమధ్యంలో పోయింది. డాక్యుమెంట్ నెంబర్ 715/2000. ఈ డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్ కు తెచ్చి ఇవ్వగలరు.

ఇట్లు
ధారావత్ సక్రు తండ్రి రామకోటి
మాచినేని పాలెం గ్రామం,
వత్సవాయి మండలం, ఎన్టీఆర్ జిల్లా.
సెల్ నెంబర్: 99080 21837.

పేరు మార్పు

నేను తాటికొండ అజయ్ మురారి, S/o. తాటికొండ వేణు గోపాల కృష్ణా రావు, నివాసం డోర్.నెం.4-82, మెయిన్ రోడ్డు, భజన మందిరం దగ్గర, గంపలగూడెం, ఎన్.టి.ఆర్ జిల్లా. ప్రస్తుతం నా ఆధార్‌లో నా పేరు దత్తత ముందు తాటికొండ అజయ్ మురారి, S/o తాటికొండ వేణు గోపాల కృష్ణా రావు, తాటికొండ విజయలక్ష్మి (జన్మత: తల్లి దండ్రులు) ఇప్పుడు దత్తత తర్వాత పేరు మార్పు చేసుకొనగా **చంద్రుపట్ల అజయ్ మురారి క్రిష్**, S/o. **చంద్రుపట్ల నాగేశ్వరరావు**, **చంద్రుపట్ల విజయలక్ష్మి** (దత్తత తల్లి దండ్రులు)గా మార్పు చేసుకోవటం జరుగుతుంది. (CHANDRUPATLA AJAY MURARI KRISH, S/o. CHANDRUPATLA NAGESWARARAO, CHANDRUPATLA VIJAYA LAKSHMI (ADOPTED PARENTS) కావున నేటి నుండి నా పేరు **చంద్రుపట్ల అజయ్ మురారి క్రిష్** గా పిలవబడును. ఆధార్‌లో మార్పుకొరకు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఇ.పి. నెం. 49/2019 ఇన్ ఓ.యస్.నెం. 91/2009

బిట్వీన్
పెడన మున్సిపాలిటీ, రిప్రజెంటెడ్ బై ఇట్స్ కమీషనర్ .... D.Hr
మరియు
చిరివెళ్ళ రామకృష్ణ .... J.Dr

పై నెంబరు డిక్రీ బాకీని రాబట్టుకునే నిమిత్తం J.Dr యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో గల ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది. 20-12-2025న ఉదయం 10-30 గం.ల నుండి పై కోర్టువారి యెదుట వేలం వేయబడును. కావున పాడుకొన దలచిన వారు సదరు వేలంపాటలో పాల్గొని వేలం షరతులకు లోబడి పాట పాడుకొనవచ్చును.

వేలం వేయు షెడ్యూలు ఆస్తి వివరం :
కృష్ణాజిల్లా, పెడన సబ్ రిజిస్ట్రారు వారి ఇలాకా, పెడన మండలం, పెడన మున్సిపాలిటీలోని ఆర్.ఎస్.నెం. 497/3లోని 200 చ.గ. గల స్థలమునకు హద్దులు : తూర్పు : కోమట్ల శివనాగేంద్రం గారి స్థలం, దక్షిణం : సిరివెళ్ళ రాము గారి స్థలం, పడమర : 4 గజముల వెడల్పు గల నడక దారి, ఉత్తరం : పార్థసారథి గారి స్థలం. ఈ హద్దుల మధ్య గల 200 చ.గ.ల స్థలము

D.Hr వాల్యూ : రూ.5,00,000/-
అమీనావాల్యూ : రూ.12,00,000/-
మార్కెట్ వాల్యూ : రూ. 13,00,000/-
వేలం తేది : 20-12-2025
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

మచిలీపట్నం **ఓ.యస్.ఎ. శివకుమార్**
ది.28-11-2025 **న్యాయవాది, మచిలీపట్నం**

గ్రామ పంచాయతీ, దాచవరం

టెండర్ ప్రకటన

ఆర్ఓసి నెం. **తేదీ.05-3-2025**

ఎన్టీఆర్ జిల్లా, వీరులపాడు మండలం దాచవరం గ్రామ పంచాయతీ కార్యాలయం నందు 2025-26 సం. నకు కాంట్రాక్టు లేబర్ పద్ధతి పై ఈ దిగువ తెలిపిన పనులు చేయుటకు గాను ది. 15.3.2025 వ తేదీన ఉదయం 12.00 గం. లకు సీల్డు టెండర్లు స్వీకరించ బడును. అదే రోజు మధ్యాహ్నం గం. 3.30.ని.లకు టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరవబడును. పూర్తి వివరాలు ఆఫీసు పని వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

కాలపరిమితి... 01-4-2025 నుండి 31.3.2026 వరకు

వ. నెం.	పని పేరు	ధరావత్తు
1.	వీధి విద్యుత్ దీపాలు నిర్వహణ 01	రూ. 1000/-
2.	మంచినీటి నిర్వహణ కు 01	రూ. 1000/-

గమనిక :- 1. గతంలో గ్రామ పంచాయతీ లో పని చేసిన వారికి ప్రాధాన్యత.
2.గ్రామ పంచాయతీ నిధులు నిల్వ బట్టి వేతనాలు చెల్లింపులు చేయబడును
3.టెండర్లు నిర్వహణ లేదా రద్దు చేయుటకు గ్రామ పంచాయతీ కి పూర్తి అధికారం కలదు.
4.పైన తెలిపిన పనులే కాకుండా పంచాయతీ కి సంబంధించిన ఇతర పనులు చేయుటకు అంగీకారం తెలుపవలెను.

గద్దె వెంకటేశ్వర్లు, సర్పంచ్, **వై . శశిరేఖ, పంచాయతీ కార్యదర్శి,**
దాచవరం గ్రామ పంచాయతీ. **దాచవరం, వీరులపాడు మండలం, ఎన్టీఆర్ జిల్లా.**

వరి కోత మిషన్లు అందుబాటులో ఉంచాలి

కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి-కంకిపాడు: తుపాను హెచ్చరికల నేపథ్యంలో వరి కోత మిషన్లు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని పునాదిపాడు, ఉప్పులూరు, జగన్నాథపురం, గొడవర్రు గ్రామాలలో కౌలు రైతు సంఘం నాయకులు శుక్రవారం పర్యటించారు. రోడ్లపై ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ తుఫాన్లు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. వాతావరణ ప్రభావంతో రైతులకు ఖర్చులు పెరుగుతున్నాయన్నారు. వడ్లు ఆరబోయడానికి పట్టాలు అద్దెకి తీసుకొచ్చి నాలుగు ఐదు రోజులు వాటికి అద్దె చెల్లించాల్సి వస్తుందన్నారు. వరి కోత మిషన్లకు డిమాండ్ పెరగడంతో అధికంగా వసూలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, జిల్లా నాయకులు టి నరేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జూన్ మోజెస్, ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు. **ఉంగుటూరు:** మండలంలోని వెన్నూతల, నాగవరప్పాడు, ఎలుకపాడు, ఉంగుటూరు గ్రామాల్లో ఎపి రైతు, కౌలురైతు సంఘాల నాయకులు శుక్రవారం పర్యటించారు. ధాన్యం కొనుగోలు, పంట దిగుబడి, రైతుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టివి లక్ష్మణస్వామి మాట్లాడుతూ నిబంధనల పేరుతో ప్రభుత్వం రైతులను దగా చేస్తుందన్నారు. గత నెలలో వచ్చిన తుఫాను వల్ల పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలు చేస్తున్నప్పటికీ ధాన్యం ఆరబెట్టుకోవడానికి కనీసం తారు బల్లలు, పట్టాలు కూడా రైతులకు అందించలేదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ధాన్యం నిల్వ చేసుకోవడానికి కనీసం గిడ్డంగులు కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.1760కు కొనాల్సిన ధాన్యాన్ని దళారులు రూ.1425కు మించి కొనుగోలు చేసే పరిస్థితి లేదని, దీంతో రైతులు మరింత నష్టాలకు గురవుతున్నారని అన్నారు. గ్రామాల్లో నూటికి 80 శాతం మంది కౌలుదారులు ఉన్నారని, పండించిన పంటలు తుఫాను కారణంగా రంగు మారి, తప్ప, తాలు ఎక్కువగా ఉండటం వల్ల అత్యధిక నష్టాన్ని చవిచూస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించి, వారి సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ అధికారులు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం గన్నవరం మండల కార్యదర్శి సూరగాని సాంబశివరావు, కౌలు రైతు సంఘం ఉంగుటూరు మండల కార్యదర్శి ఎస్.కె.యమ్ సలీం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అజ్మీర వెంకటేశ్వరరావు, మల్లంపల్లి ఆంజనేయులు, రైతులు ఆశీర్వాదం, పోలిమెట్ల శ్రీధర్, ఆకుల భాస్కరరావు, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

వరి రైతులకు అవగాహన

ప్రజాశక్తి-మొవ్వ

వరిలో కలుపు యాజమాన్యం రైతులకు కలుపు నియంత్రణపై మొవ్వ భీమేశ్వరాలయం కళావేధిక పై శుక్రవారం "వరిలో కలుపు యాజమాన్యం" అనే సమాచార కార్నర్‌ను శుక్రవారం బాపట్ల వ్యవసాయ కళాశాల నాల్గవ సంవత్సరం విద్యార్థినులు దీప్తి, కపారాణి, జస్వంత్ వల్లి, దుర్గా భువనేశ్వరి, జాస్మిన్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ సమాచార కేంద్రం ద్వారా పొలాలలో కలుపు అంశంపై రైతులకు సవివరంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొని తమ అనుభవాలను విద్యార్థినులతో పంచుకున్నారు. కలుపు నియంత్రణపై సందేహాలు నివృత్తి చేసుకున్నారు. ఈ సమాచార కార్నర్ ద్వారాముఖ్య కలుపు మొక్కలజాతులు, వాటి లక్షణాలుపంటల దిగుబడిపై కలుపు ప్రభావం,యాంత్రిక, సాంప్రదాయ, రసాయన, జీవపద్ధతుల ద్వారా కలుపు నియంత్రణ సురక్షితంగా కలుపు మందుల వినియోగంపై జాగ్రత్తలు శ్రామిక వ్యయాన్ని తగ్గించే సమర్థవంతమైన విధానాలు వెల్లడి చేశారు.

రూ.6 వేల కోట్లతో తాగునీటి ప్రాజెక్టు : ఎంపి

ప్రజాశక్తి-నాగాయలంక

ఉమ్మడి కృష్ణాజిల్లా తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ.ఆరు వేల కోట్లతో సమగ్ర తాగునీటి ప్రాజెక్టు రూపొందిస్తున్నట్లు మచిలీపట్నం ఎంపి వల్లభనేని బాలశౌరి తెలిపారు. శుక్రవారం బొండాడ గ్రూప్ చైర్మన్ బొండాడ రాఘవేంద్రరావు జన్మదిన వేడుకలు పురస్కరించుకొని పర్రచివర గ్రామంలో బొండాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ పర్రచివర గ్రామ అభివృద్ధికి కెనరా బ్యాంకు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధిలో భాగంగా కీలకమైన తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ.3 వేల కోట్లు జల జీవన్ మిషన్ నిధులు, రూ.3 వేల కోట్లు ప్రపంచ బ్యాంకు నిధులతో ఉమ్మడి జిల్లా తాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. రూ.5 వేల కోట్లతో చేపట్టిన మచిలీపట్నం పోర్టు ఏడాదిలోపు నిర్మాణం పూర్తవుతుందన్నారు. మచిలీపట్టణం-రేపల్లె రైల్వే లైన్ పనులు ఈ ఐదేళ్లలోనే ప్రారంభించే అవకాశం ఉందన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ దివిసీమ ప్రగతికి రాఘవేంద్రరావు పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తే తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించారు. స్ఫూర్తిదాయక విజయాలు సాధించిన రాఘవేంద్రరావు తన స్వగ్రామానికి చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. బొండాడ ఫౌండేషన్ ద్వారా చైర్మన్ బొండాడ నీలిమ చేస్తున్న సమాజ సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారుమీ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, రాఘవేంద్రరావు తనయుడు బొండాడ జితిన్‌చంద్ర, సీఎఫ్ఓ భరతం సత్యనారాయణ, సీఈఓ ఆర్.శ్రీనివాసరావు, హెచ్ ఆర్ విభాగం హెడ్ వంగర కుమార్, సీనియర్ నాయకురాలు భోగాది రమాదేవి, డాక్టర్ వంగర శేషగిరిరావు పాల్గొన్నారు. ఉచిత వైద్య శిబిరంలో మణిపాల్ హాస్పిటల్ వైద్య సిబ్బంది 450 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. అనంతరం బొండాడ రాఘవేంద్రరావు కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఆయనను ఎంపీ, ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు.

గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే

వర్ధంతి కార్యక్రమాల్లో వక్తలు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: అఖండ భారతదేశంలో స్త్రీ విద్యకు ఆద్యుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.రాంజీ కొనియాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం విశ్వవిద్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భముగా రాంజీ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం రావడానికి వంద సంవత్సరాల ముందే మహిళలకు విద్య అవశ్యకతను గుర్తించి వారి కోసం పాఠశాలలు, వసతి గృహాలు కట్టించిన సామాజిక ఉద్యమకారుడు జ్యోతిరావు పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, సహాయ ఆచార్యులు దుర్గా ప్రసాద్, శాంతి కృపా పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** అణగారిన వర్గాల కోసం జ్యోతిరావ్ పూలే పాటుపడ్డారని గుడ్లవల్లేరు శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల అధినేత శింగంశెట్టి ఆదినారాయణ కొనియాడారు. పూలే 135వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పాఠశాలలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నివాళులు అర్పించారు.

గుడివాడ : బిసి సంఘం అధ్యర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతిని రావులకొల్లు నాగమల్లేశ్వరరావు అధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ముగుబజార్ వద్ద గల మహత్మా జ్యోతిరావ్ సావిత్రి ఫూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళుళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు లాకా వెంగళరావు, హైకోర్టు న్యాయవాది వేముల బేబిరాణి తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: వైసిపి కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి రాష్ట్ర రైతు విభాగం రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింహాద్రి రమేష్‌బాబు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె శ్రీనివాసరావు, చింతలపూడి బాల భాస్కరరావు, అవనిగడ్డ రంగనాథ్ పాల్గొన్నారు. టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, బండే కనకదుర్గ, మోర్ల జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి: చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, విశ్రాంత ఈవో ఆర్డి దాసి సీతారామరాజు, మీర్ రిజ్వాన్ పాల్గొన్నారు.

మచిలీపట్నం అర్బన్: అంటరానితనం రూపుమాపడానికి, సమసమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ చదువుకోవడమే పరిష్కార మార్గంగా జ్యోతిబాపూలే గుర్తించి ఆ దిశగా సమాజాన్ని నడిపించారని పౌర సంక్షేమ సంఘం నాయకులు కొడాలి శర్మ పేర్కొన్నారు. శుక్రవారం జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా మచిలీపట్నం ఎల్‌ఐసి డివిజనల్ కార్యాలయం దగ్గర పూలే విగ్రహానికి పూలమాలలతో ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కేవీపీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, సీఐటీయూ జిల్లా సహయ కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, సిఐటియు మండల కన్వీనర్ చిరువోలు జయరావు, కొడమంచిలి చంద్రశేఖర్, దగాని సుబ్బారావు, అరిగెల సురేష్ కుమార్, గండ్రపు సీనయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..!

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి కొడాలి సురేష్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు సమస్యలపై మాట్లాడారు. కట్టవాని చెరువు, చింతలగుంట గ్రామాల్లో 50 మంది విద్యార్థులు వున్నా పాఠశాల భవనం లేదంటూ కట్టవానిచెర్వు సర్పంచ్ బొట్ల వీరమ్మ, కౌతరంలో 30 లక్షలతో వాటర్ వర్క్స్ మరమ్మతులు చేసినా తాగునీరు బాగోలేదంటూ ఎంపిటిసి చీర దుర్గా భవాని, అంగన్వాడీ కేంద్ర భవనాల మంజూరు ఎన్నాళ్ళకు వస్తాయంటూ చినగొన్నూరు సర్పంచ్ కోటప్రోలు నాగు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు పలు ప్రజా సమస్యలపై ప్రశ్నలు లేవనెత్తుతూ వివిధ శాఖల అధికారుల సమాధానాలపై అసంతృప్తి వ్యక్తం చేసారు. ఎంపిడిఓ ఎండి ఇమ్రాన్ సమన్వయం చేస్తూ అధికారులు సమగ్ర సమాచారం చెప్పాలని, ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎస్ఐ ఎన్‌వివి సత్యనారాయణ బాల్య వివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లోకరాజు, ఇన్చార్జ్ సిడిపిఓ పద్మావతి, సూపర్వైజర్ నసీరున్నీసా, కార్యదర్శులు ఎజెఎల్ నరసింహారావు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు అర్జీల వెల్లువ

ప్రజాశక్తి-నందివాడ: మండలంలోని రామాపురం గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే రాము ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే రాము ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. అర్జీలు అందించేందుకు రామాపురం పరిసర గ్రామాల ప్రజలు పోటెత్తారు. అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకున్నారు. సాంకేతిక, ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని రాము భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, గ్రామాల అభివద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్చార్జి బూర్రగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ రవికుమార్, మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు,కాకర్ల సురేష్, ఎమ్మార్వో ఎన్.గురుమూర్తి రెడ్డి, ఎంపీడీవో పి.మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల ఈత పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: కృష్ణా విశ్వవిద్యాలయల స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో ఇడుపుగల్లు శాప్ ఈతకోలనులో పోటీలు ప్రారంభమయ్యాయి. కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల ఈత ఛాంపియన్షిప్‌ను విశ్వవిద్యాలయ రెక్టార్ ప్రొఫెసర్ ఎంబి బసవేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ ఈత అనేది రక్షణాత్మక కళ అని ప్రతి ఒక్కరూ ఈతను నేర్చుకొని శరీర ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈత సాధన చేయడం ద్వారా శరీరంలో అన్ని కండరాలకు వ్యాయామం అందుతుందని చెప్పారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ఈత క్రీడాకారుడు ఎం. తులసి చైతన్య కి సన్మానం చేసి అభినందించారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో సౌత్ జోన్, ఆల్ ఇండియా విన్నర్స్ కి పది శాతం మార్క్స్ ఇన్సెంటివ్ గా ఇస్తున్నామని ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి వారి ప్రతిభను చూపి అంది పుచ్చుకోవాలని కోరారు. ఈ అంతర విశ్వవిద్యాలయ ఈత పోటీలకు సెలక్షన్ కమిటీ మెంబర్లుగా డాక్టర్ రఘురాం, ప్రిన్సిపల్, సప్తగిరి కాలేజ్, డాక్టర్ యుగంధర్, ఫిజికల్ డైరెక్టర్, ఎస్ ఆర్ ఆర్ అండ్ సివిఆర్ కాలేజ్ ఈ కార్యక్రమానికి కార్యదర్శిగా డాక్టర్ పర్చూరి గోపి వ్యవహరించారు.

మత్తు పదార్థాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

విజయవాడ: విజయవాడ పడమటలోని త్రివేణి మహిళా జూనియర్ కళాశాలలో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'మాదక ద్రవ్యాలు – ఆరోగ్యంపై ప్రభావం" అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ జ్యోతి చంద్రిక మాట్లాడుతూ మాదకద్రవ్యాల మత్తులో జీవితాలు పాడుచేసుకోవద్దని తెలిపారు. మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని 1972 పోలీసు శాఖకు అందించాలని కోరారు. ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థులను త్రివేణి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పుష్పలత అభినందించారు. విజేతలైన పావని, విష్ణుప్రియ, పల్లవికి బహుమతులు అందజేశారు.

ప్రత్యక్ష ప్రయోగాలతో మెరుగైన విద్య : డిఇఒ

ప్రజాశక్తి – విజయవాడ సిటీ : సామాన్యశాస్త్ర పాఠ్యపుస్తకాల్లో ఉండే ప్రయోగాలను చదివి అర్థం చేసుకోవడం కంటే వాటిని ప్రయోగ శాలల్లో ప్రత్యక్షంగా పరిశీ లించడం ద్వారా సందేహాలు తొలగి, ఆ అంశాలపై పూర్తి పరిజ్ఞానం, సాధికారత ఏర్పడతాయని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా కెబిఎన్ కళాశాల ప్రారంభించిన హ్యాండ్స్ ఆన్ సైన్స్ కార్యక్రమాన్ని శుక్రవారం సుబ్బారావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హ్యాండ్స్ ఆన్ సైన్స్ ప్రోగ్రాంలో పదో తరగతి విద్యార్థులకు వారి పాఠ్యపుస్తకాల్లోని సైన్స్ ప్రయోగాలను ప్రత్యక్షంగా చేసి, వివరించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయి ప్రయోగశాలలు లేకపోవటం వల్ల పిపిపి పద్ధతిలో కెబిఎన్ కళాశాలతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కష్ణవేణి మాట్లాడుతూ ప్రయోగాలను ప్రత్యక్ష పరిశీలన ద్వారా నేర్చుకోవడం వల్ల విద్యార్థులకు ఎక్కువకాలం ఆ అంశాలు గుర్తుంటాయని, పరీక్షల్లో కూడా మంచి మార్కులు సాధించడం సాధ్యమవుతుందన్నారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ త్వరలో గణిత ప్రయోగశాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. హిందూ హైస్కూల్స్ పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.విజయ్ బాబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలని వినతి

ప్రజాశక్తి – విజయవాడ సిటీ : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు కేటాయిస్తున్న ఇళ్ల మంజూరులో అర్హులైన తెల్ల రేషన్ కార్డు ఉన్న ఆర్యవైశ్యులకు తగు ప్రాధాన్యత ఇవ్వాలని శ్రీ వాసవి ఫౌండేషన్ చైర్మన్ వివికే నరసింహారావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎంపీ క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బారులో శివనాథ్‌ను కలిసి శ్రీ వాసవి ఫౌండేషన్ తరపున వినతి పత్రం అందజేశారు. పేద, మధ్య తరగతి వర్గాలలో ఆర్యవైశ్యులు అధికంగా ఉన్నారని, వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు గురవుతున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో ఆర్యవైశ్యులకు దామాషా ప్రకారం అవకాసం కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఎంపీ గివెన్ ప్రజా దర్బరు ప్రజా దర్బార్ కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించిన వారిలో మాజీ కార్పొరేటర్ నూకల నాగేశ్వరరావు తోపాటు పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉన్నారు.

'జీతమైనా ఇవ్వండి...విషమైనా ఇవ్వండి'

- విఎంసి వద్ద పారిశుధ్య కార్మికురాలి ఆందోళన
- సిఎంఒహెచ్ హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి-విజయవాడ : "జీతం అయినా ఇవ్వండి".. "విషం అయినా ఇవ్వండి" అనే నినాదంతో ఆప్కాస్ పారిశుధ్య కార్మికురాలు విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన గేటు వద్ద శుక్రవారం నోటికి నల్లరిబ్బన్ కట్టుకొని చేసిన ఆందోళన విఎంసిలో తీవ్ర కలకలం సృష్టించింది. వన్‌టౌన్‌లోని 40వ డివిజన్‌లో గత 20 సంవత్సరాలుగా ఆప్కాస్ కార్మికురాలుగా పని చేస్తున్న అన్నవరపు వీరమ్మకు గత ఎనిమిది మాసాల నుంచి వేతనాలు మంజూరు చేయకుండా సంబంధిత ప్రజారోగ్య విభాగం అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కార్మికురాలితో నిత్యం పని చేయిస్తూ వేతనం ఇప్పించే విషయంలో మాత్రం శానిటరీ ఇనిస్పెక్టర్ దగ్గర నుంచి శానిటరీ సూపర్‌వైజర్, ఎఎంఒహెచ్, సిఎంఒహెచ్ వరకు పట్టించుకోకుండా పలు రూపాల్లో ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధిత కార్మికురాలు విలేకరుల ఎదుట కన్నీరుమున్నీరు అయింది. గత రెండు సంవత్సరాల క్రితం తన భర్త మృతి చెందడం, నెలల తరబడి వేతనం రాకపోవడం, పెరిగిన ధరలతో కుటుంబం గడవటం కష్టంగా మారిందని, చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితుల్లో వేతనం మంజూరు చేయాలని పలుమార్లు అధికారులను ప్రాధేయపడినా లాభం లేకపోవడంతో చేసేది లేక ఆందోళనకు దిగినట్లు వాపోయింది. అనంతరం నేరుగా ప్రజారోగ్య విభాగం అధికారి (సిఎంఒహెచ్) చాంబర్ వద్దకు చేరుకొని అక్కడ ఆందోళనకు దిగింది. కార్మికురాలి ఆందోళనకు ఎఐటియుసి అనుబంధ మునిసిపల్ యూనియన్ నేతలు రాజా, ఎస్‌విఎస్ చలం మద్దత్తు ఇచ్చి ఆందోళనలో పాల్గొన్నారు. సిఎంఒహెచ్ డాక్టర్ అర్జునరావు తన చాంబర్ నుంచి బయటకు వచ్చి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికురాలు తన ఆందోళనను విరమించారు. అయితే, డివిజన్‌లో ఉన్న శానిటరీ ఇనిస్పెక్టర్.. సంబంధిత ఉన్నతాధికారుల అండతో వీరమ్మ పోస్టును వేరే వ్యక్తికి పెద్ద మొత్తంలోనే ముడుపులు పుచ్చుకొని అమ్మేసినట్లు తెలిసింది. ఈ నేపధ్యంలోనే వీరమ్మ ఆందోళనకు దిగడంచర్చనీయాంశమైంది.

ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఎంపి నీరజ్ డాంగి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: దేశంలో బిజెపి కేంద్ర ప్రభుత్వం కబంధ హస్తాల నుండి ప్రజాస్వామ్యన్ని కాపాడేది కాంగ్రెస్స్ పార్టీయేనని ఎఐసిసి పరిశీలకులు, రాజ్యసభ సభ్యులు నీరజ్ డాంగి పేర్కొన్నారు. శుక్రవారం సంఘటన శ్రీజాన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు బొర్రా కిరణ్, జగ్గయ్యపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కర్నాటి అప్పారావు ఆధ్వర్యంలో పట్టణంలో కన్వెన్షన్ హాల్‌లో ఎన్‌టిఆర్ జిల్లాలో జరుగు సంస్థాగత నిర్మాణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నీరజ్ డాంగి పాల్గొని మాట్లాడుతూ దేశ సమగ్రతను, ప్రజాస్వామ్య వ్యవస్థను బిజెపి కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడి, అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే నని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు కషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు రేపాల మోహనరావు, ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్స్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్, నియోజకవర్గ ఇన్ ఛార్జ్ కర్నాటిఅప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ ఫ్రైడే సేల్ ప్రారంభం

ప్రజాశక్తి – విజయవాడ అర్బన్ : అమెజాన్ బ్లాక్ ఫ్రైడే సేల్ నవంబర్ 28 నుండి డిసెంబర్ 1వ తేదీ వరకు జరుగుతుందని సంస్థ ప్రతినిధి జె.తారక్ ఒక ప్రకటనలో తెలిపారు. యాపిల్, సామ్సంగ్, హెచ్పి, బాత్ అండ్ బాడీ వర్క్స్, ప్రెస్టీజ్, సెల్లో, టైటన్, లోరియేల్, ప్యూమా, వన్ ప్లస్, ఇంకా మరెన్నో అగ్రశ్రేణి బ్రాండ్లకు చెందినవి ఈ సేల్ నందు ఉంటాయని అన్నారు. గృహాలంకరణ, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, సౌందర్యసాధనాలు, దుస్తుల వంటి వివిధ విభాగాలకు చెందిన లక్షలాది ముందస్తు డీల్సును కస్టమర్లు యాక్సెస్ చేయగలుగుతారని తెలిపారు. షాపింగ్‌ను సులభతరం చేసేందుకు కస్టమర్లు, న్యూ డీల్ డ్రాప్ వంటి కూర్చి పెట్టిన డీల్సును, బ్లాక్ ఫ్రైడే బెస్ట్ సేల్ పేరుతో విక్రయిస్తారని తెలిపారు. రోజువారి థీమ్డ్ సెలక్షన్స్ కోసం షాపింగ్ చేసి, యాక్సిస్, బ్యాంక్ ఆఫ్ బరోజా, హెచ్డిఎఫ్సి, అమెజాన్ పే ఐసీఐసిఐ క్రెడిట్ కార్డ్ లావాదేవీలపై 10 శాతం వరకు ఆదా చేసుకోవచ్చని తెలిపారు.

నాసా ప్రాజెక్ట్ కిట్లు అందజేత

ప్రజాశక్తి – విజయవాడసిటీ : నాసా ప్రాజెక్ట్ చేస్తున్న భవానీపురం శ్రీ చైతన్య స్కూల్‌కి చెందిన 25 మంది విద్యార్థులు శుక్రవారం ఎంపి కేశినేని శివనాథ్‌ను పశ్చిమ నియోజకవర్గం క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ ప్రాజెక్ట్ చేస్తున్న విద్యార్థులకు స్కూల్ అందించే నాసా ప్రాజెక్ట్ కిట్స్ ఎంపి కేశినేని శివనాథ్ అందజేశారు. విద్యార్థులతో మాట్లాడి ఎలాంటి ప్రాజెక్టులు చేయబోతున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను టెక్నాలజీ రంగంపై ఆసక్తి కలిగించే ప్రోత్సహిస్తున్నందుకు స్కూల్ ప్రిన్సిపాల్ ప్రదీప్, నాసా ప్రాజెక్ట్ ఇన్చార్జ్ ప్రణీతలను ఎంపి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఖాదర్ బాషా, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సురేష్, డీన్ రంగరావు, ఎ.జి.ఎమ్ మురళీకృష్ణ, ఆర్ఐ వినోద్ పాల్గొన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా రాణించాలి

ప్రజాశక్తి– విజయవాడ సిటీ: విజయవాడ వన్‌టౌన్లోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో శుక్రవారం ఎంట్రప్రెన్యూర్షిప్ డెవలప్మెంట్ విద్యార్థి దశ నుంచే శక్తివంతమైన నాయకత్వ లక్షణాలతో యువ పారిశ్రామికవేత్తలుగా ఎదగటం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా సెంట్రల్ యూనివర్సిటీ, కర్ణాటకకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.లింగ మూర్తి, సాగర్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్ స్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ విద్యాసాగర్ వీసంశెట్టి పాల్గొన్నారు. లింగమూర్తి మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థలో యువతకు ఉన్న అవకాశాలను ప్రస్తావించడంతో పాటు, ఉన్నత విద్య లేకపోయినా కేవలం బలమైన ఆలోచనతో ఎంతోమంది సాధించిన విజయాలను ఉదాహరణలుగా పేర్కొన్నారు. ఈ పోటీ ప్రపంచంలో ప్రత్యేకత, వినూత్నతే విజయానికి కీలకమని విద్యార్థులకు సూచించారు. విద్యాసాగర్ మాట్లాడుతూ మనం శూన్యంతో ప్రారంభించినా, మన దక్పథం, మన నమ్మకం ఎంత దూరం తీసుకెళ్తాయో నిర్ణయిస్తుందని స్పీకర్లు ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి సెక్రటరీ డాక్టర్ సిఎ. చిట్టా అమర్ సుదీర్, ట్రెజరర్ కాజా రాఘవయ్య, వైస్ ప్రెసిడెంట్ పొట్టి సురేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం

విజయవాడ సిటీ : మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతిని పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. కెఎల్ రావు నగర్‌లో బిసి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి అసోసియేషన్ అధ్యక్షులు ఎన్విరావ్, ప్రధాన కార్యదర్శి నమ్మి అప్పారావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్విరావ్ మాట్లాడుతూ చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేసినప్పుడే పూలే ఆశయాలు అమలైనట్లు భావిస్తామని పేర్కొన్నారు. **విజయవాడ సిటీ :** దేశంలో నిరక్షరాస్యతను నిర్మూలించి సామాజిక చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నించిన గొప్ప సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే అని, ఆయన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఇస్మాయిల్ బేగ్, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్ అన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఎన్డీఏ కార్యాలయంలో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, నేతలతో కలిసి పూలేకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య, టిడిపి నాయకులు మైలవరపు దుర్గారావు, పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని విజయవాడరోడ్డులో వైసిపి జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, పట్టణంలోని కృష్ణ ఫార్మర్స్ సొసైటీ వద్ద టిడిపి ఆధ్వర్యంలో సొసైటీ చైర్మన్ యానాల గోపిచంద్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు, జగ్గయ్యపేట నియోజకవర్గ బీసీ అధ్యక్షుడు సత్య శేఖర్ ఆధ్వర్యంలో పూలే వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీపట్నంలో జనసేన నాయకులు అక్కల రామ్మోహన్ రావు (గాంధీ) ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలేకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ జనసేన పార్టీ అధ్యక్షులు చెరుకుమల్లి సురేష్, సెంట్రల్ ఆంధ్ర ప్రోగ్రాం కమిటీ మెంబెర్ ఎట్టుంశెట్టి నాని, రాగాల నాని, పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలోని వైసిపి కార్యాలయంలో పూలే చిత్రపటానికి బీసీ సెల్ అధ్యక్షులు కుంచం జయరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, సీనియర్ నాయకులు మాధవరావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ నార్ల తాతారావు తాప విద్యుత్ కేంద్రంలో పూలే చిత్రపటానికి చీఫ్ ఇంజినీర్ పి. శివ రామాంజనేయులు నివాళులు అర్పించారు. **గంపలగూడెం:** గంపలగూడెంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద జ్యోతిరావు పూలే చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎడ్లపల్లి రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. మండల బిసి అధ్యక్షుడు తమ్మారపు ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వేల్పుల పాపమా గద్దల ఆదాం పాల్గొన్నారు. **తిరువూరు :** తిరువూరు వైసిపి కార్యాలయంలో పూలే వర్ధంతిని టిడిపి, వైసీపీ, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో విడివిడిగా నిర్వహించారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తన కార్యాలయంలో పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైసిపి నియోజకవర్గ కార్యాలయంలో ఆ పార్టీ ఇన్‌ఛార్జ్ నల్లగట్ల స్వామిదాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పల్లెపాటి శ్రీనివాసరావు రాజీవ్ భవనంలో నాయకులతో కలిసి పూలే వర్ధంతిని నిర్వహించారు. **కంచికచర్ల :**కంచికచర్లలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి కవి, రచయిత తంగిరాల సోని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కర్ల రవి కుమార్, బర్రె శంకరరావు, పిల్లి స్వామిదాస్, దొడ్డ ఇమ్మానియేల్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ కెఎల్ రావు నగర్‌లో నివాళులర్పిస్తున్న బిసి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు

ఎన్‌డిఎ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నేతలు

'దిత్వా' తుపానుతో అప్రమత్తం : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): దిత్వా తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హిన్ జాహిద్, డిఆర్ఓకే చంద్రశేఖర రావు, అదనపు ఎస్పీ సత్యనారాయణలతో కలిసి తుపాను ముందస్తు జాగ్రత్త చర్యలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ద్విత్వా తుపాను వల్ల అధికంగా వర్షపాతం నమోదవుతుందన్నారు. వర్షపు నీటిని వెంటనే బయటకు తొలగించేందుకు ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎక్కడా ధాన్యం తడిసిపోయి రైతులు నష్టపోకూడదని స్పష్టం చేశారు. పక్వానికి రాకుండానే వరి కోతలు కోయకుండా చూడాలన్నారు. వరి పంట కోసి ఉంటే ఆ ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించే ఏర్పాటు చేయాలన్నారు. అలా వీలుకాని పక్షంలో వర్షానికి ధాన్యం తడవకుండా రైతులకు వెంటనే టార్పాలిన్ పట్టలు పంపిణీ చేయాలన్నారు. మార్కెట్ యార్డ్ గోదాములు గాని సహకార సంఘాల గోదాములు గాని లేదా సమీపంలోని ఏదైనా మంచి భవనాలలోకైనా సురక్షితంగా ధాన్యాన్ని తరలించి భద్రపరచాలన్నారు. సముద్రంలో చేపలు వేటకు ఇది వరకే వెళ్లిన మత్స్యకారులను వెంటనే తీరానికి పిలిపించాలన్నారు. మురికి కాలువలు అన్నీ పూడికలు తీసివేసి నీటి ప్రవాహం సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా, వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పశువులకు గతంలో మాదిరే నష్టం జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఇప్పటినుండే వారికి కేటాయించిన మండలాల్లో పర్యటించి ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిల్లులకు ధాన్యం తరలింపు

ప్రజాశక్తి-చల్లపల్లి. తుఫాను హెచ్చరిక నేపథ్యంలో చల్లపల్లి తాసిల్దార్ డి.వనజాక్షి ఆధ్వర్యంలో అధికారులు రోడ్లపై ఆరబోసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. తుఫాను వార్తలతో యంత్రాల ద్వారా గ్రామాల్లో ముమ్మరంగా వరి కోతలు సాగుతున్న నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని ఎక్కడికక్కడే హైవేపై, రోడ్లపై ఆరబోసుకుంటున్నారు. నెలాఖరకు తుఫాను ప్రభావం ఉంటుందనే సమాచారంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యారు. జెసి ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన అధికారులు రోడ్లపై ఆరబోసుకున్న ధాన్యాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడి తేమశాతం పరిశీలించారు. ఆన్‌లైన్‌లో ట్రక్ షీట్ ఆపరేట్ చేయించి ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. చల్లపల్లి మండలంవెలివోలు, పుచ్చగడ్డ, వక్కలగడ్డ,లక్ష్మీపురం, మాజేరు గ్రామాల్లో తాసిల్దార్ పర్యటించారు. రోడ్లపై ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. 22, 23 తేమ శాతం వరకు ఉన్న ధాన్యాన్ని ట్రాక్టర్లను, లారీలను పిలిపించి బస్తాలను లోడ్ చేయించి మిల్లులకు తరలించారు.ధాన్యం కొనుగోలు కోసం సిద్ధంగా ఉంచిన

వాహనాలతో పాటు మిల్లర్ల సహాయంతో అదనంగా వాహనాలను రప్పించారు.శుక్రవారం సుమారు నాలుగు వేల బస్తాల ధాన్యం కొనుగోలు చేసినట్లు తాసిల్దార్ తెలిపారు.తుఫాను బారిన పడకుండా పంటను కాపాడేందుకు అధికారులు దగ్గరుండి ధాన్యం కొనుగోలు తరలింపు కార్యక్రమం చేపట్టారు. గ్రామ రెవెన్యూ అధికారులు పరిసే కిరణ్ కుమార్, ప్రతిమ ముదునూరి అమరేశ్వర రావు, పిఎ సి ఎస్ సీఈవోలు చక్రపాణి,నాగేశ్వరరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ధాన్యం తరలింపులో ఇబ్బందులు ఎదురైనా, గోనె సంచులు కావాలన్నా, వాహనాలు అవసరమైనా 9908064610 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

ప్రభుత్వం ధాన్యాన్ని కొనాలి

ప్రజాశక్తి-మొవ్వ: యంత్రాల ద్వారా నూర్పుళ్లు జరిగిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలో అయ్యంకి, కారకంపాడు, చినముత్తేవి, అవిరిపూడి గ్రామాలలో

పర్యటించి నూర్చి పరదాలపై ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. చిన ముత్తేవి గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో నూర్చిన ప్రతి గింజను రైతుల వద్ద సేకరించాలని, రైతులు నష్టపోకుండా కాపాడాలని, అన్ని గ్రామాలకు కావలసిన గోనె సంచులు, లారీలు పరదాలు, సప్లై చేయాలని, జిపిఎస్ లేని లారీలకు కూడా తుఫాన్ నేపథ్యంలో అనుమతి ఇచ్చి రోడ్లపై ధాన్యం నిల్వ లేకుండా రైస్ మిల్లులకు తరలించాలని ప్రభుత్వాన్ని కోరారు. వడ్ల గింజపై మానుగాయ కలర్ మాత్రమే అతుక్కుని రంగు మారినట్టుగా కనిపిస్తుందని, ఈ వాస్తవాన్ని ప్రభుత్వ అధికారులు, రైస్ మిల్లర్లు పరిశీలించి రంగు మారిన ధాన్యానికి నిబంధనలు సడలించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రేపు ఓపెన్ సైక్లోథాన్

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఓపెన్ సైక్లోథాన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తునట్లు స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన ఎన్టీఆర్ మెమోరియల్ ఓపెన్ సైక్లోథాన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్, 1, 2 టూటౌన్ సీఐలు శ్రీనివాస్, హనీష్, తదితరలు మాట్లాడుతూ డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు, 3 కేటగిరీల్లో నిర్వహించే పోటీల్లో 15 సంవత్సరాలు దాటిన వారికి 10 కిలోమీటర్లు, 15 ఏళ్లలోపు వారికి 5 కిలోమీటర్ల మేర సైక్లోథాన్ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిల్లారపు రంగప్రసాద్, ఐఎంఏ నాయకులు డాక్టర్ పొట్లూరి వంశీ, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రంగానికి అంతర్జాతీయ గుర్తింపు : రాము

ప్రజాశక్తి-గుడివాడ : ఆక్వా రైతాంగానికి ప్రయోజనం చేకూరేలా సిఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన ఆక్వా డిజిటల్ ట్రేసబులిటీ శిక్షణ ద్వారా నందివాడ మండల ఆక్వా రంగానికి అంతర్జాతీయ గుర్తింపు వస్తుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం నందివాడ మండలంలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఆక్వా డిజిటల్ ట్రేసబులిటీ ప్రాజెక్ట్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే నెక్స్ట్ ఆక్వా శిక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ దేశంలోనే తొలిసారి ఆక్వా డిజిటల్ ట్రేసబులిటీ ప్రాజెక్ట్‌లో నెక్స్ట్ ఆక్వా శిక్షణకు నందివాడ మండలంలోని అరిపురాల, రామాపురం, పుట్టగుంట, నందివాడ తుమ్మలపల్లి గ్రామాలు తొలి ఫేజ్‌లో ఎంపిక అయ్యాయన్నారు. ఈ శిక్షణ ద్వారా రైతాంగానికి గుర్తింపు సర్టిఫికెట్ అందుతుందని తద్వారా ఆక్వా ఉత్పత్తులకు డిమాండ్ పెరగడమే కాక, అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి బూర్రగడ్డ శ్రీకాంత్, ఫిషరీస్ కమిషనర్ రమాశంకర్‌నాయక్, మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, టిడిపి నాయకులు చేకూరు జగన్ మోహన్‌రావు, ఆరెకపూడి రామశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి : పేర్ని

ప్రజాశక్తి-మోపిదేవి: ప్రభుత్వం రైతుల సమస్యలు పరిష్కరించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు పేర్ని వెంకట్రామయ్య (నాని) డిమాండ్ చేశారు. శుక్రవారం మోపిదేవి మండల పరిధిలోని పెద్దకల్లేపల్లి గ్రామంలో రైతుల పండించిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్, గరికపాటి వెంకటేశ్వరరావు, పూర్ణచంద్రరావు, ఆది, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి : కాగిత

ప్రజాశక్తి-పెడన: పెడన మండలం గురివిందగుంట గ్రామంలో 'రైతన్నా మీ కోసం' కార్యక్రమంలో పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయానికి వేదికగా, మన రైతన్నలకు సాగులో ఉన్న సమస్యలపై శాస్త్రీయ పరిష్కారాలు, కొత్త పంట రకాలు, దిగుబడి పెంచే ఆధునిక పద్ధతులపై శిక్షణ ఇవ్వనున్నారన్నారు. రైతులు కేవలం పంట పండించడమే కాదు, లాభసాటిగా మార్కెటింగ్ చేసుకునేలా తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను నేరుగా విని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేశారు.

5న క్యాంటీన్ నిర్వహణకు వేలం పాట

ప్రజాశక్తి-చల్లపల్లి: చల్లపల్లి రైతు బజార్ ప్రాంగణంలో క్యాంటీన్ నిర్వహణకు ఒక సంవత్సర కాలానికి వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎస్టేట్ అధికారి కే చంద్రమోహన్ తెలిపారు. వచ్చే నెల 5వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లా వ్యవసాయ వాణిజ్యం మార్కెటింగ్ అధికారి కార్యాలయం ప్రాంగణంలో వేలం పాట జరుగుతుందని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లో తనిఖీలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని ఉలవలపూడి అంగన్‌వాడీ కేంద్రంలో గుడివాడ ఇన్‌చార్జి సీడీపీఓ పద్మావతి తనిఖీ చేశారు. తనతో పాటు సూపర్‌వైజర్ ఎండీ నసీరున్నీసా అంగనవాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులను, బాలింతలను, పిల్లలను సరుకుల పంపిణీపై శుక్రవారం అడిగి తెలుసుకున్నారు. సరుకుల్లో ఎలాంటి లోపమూ లేదని విచారణలో తేటతెల్లమైంది. ఫుడ్ స్టాక్ నాణ్యతను కూడా పరిశీలించిన తరువాత మాత్రమే లబ్దిదారులకూ అందించాలని కార్యకర్తను సీడీపీఓ ఆదేశించారు.

ఎస్ఇ సత్యానందంకు సత్కారం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): విద్యుత్ శాఖ ఎస్ఇ సత్యానందం విశిష్ట సేవలు అందించారని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అభినందించారు. సిపిడిసిఎల్ ఎస్ఇ సత్యానందం చీఫ్ ఇంజనీరుగా ఉద్యోగోన్నతి లభించిన నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్ మీకోసం సమావేశ హాల్లో జిల్లా యంత్రాంగం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ శాఖ చాలా

ముఖ్యమైన శాఖ అని, ఆ శాఖ సరిగా పనిచేయకపోతే చాలా సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకాన్ని విజయవంతంగా అమలు చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేందుకు సత్యానందం ఎంతగానో కృషి చేశారన్నారు. అలాగే ఇటీవల సంభవించిన మొంథా తుఫానులో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారని ప్రశంసించారు. అనంతరం సత్యానందంను శాలువలు, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, కెఆర్ఆర్‌సిఎస్‌డిసి శ్రీదేవి, డిఆర్డిఏ పీడీ హరిహరనాథ్, హౌసింగ్ జిల్లా అధికారి పోతురాజు, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈలు రమణరావు, సోమశేఖర్, డిఎస్ఓ మోహన్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ యుగంధర్, జిల్లా విద్యాధికారి పివిజే రామారావు, జిల్లా ఉద్యాన అధికారి జే జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలి

మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం): విద్యా రంగంలోని సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో యూటిఎఫ్ మండల అధ్యక్షులు జివి రవిబాబు అధ్యక్షతన యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు

రవిబాబు

రాజాబాబు

బోధనేతర పనులు తొలగించాలని అప్పుడే విద్యావ్యవస్థ సజావుగా నడుస్తుందని అన్నారు. అనవసరమైన భోధనేతర పనులు ఉపాధ్యాయులపై మోపి నాణ్యమైన విద్య అందించాలని కోరడం సబబు కాదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయులు వివిధ మొబైల్ యాప్ల ద్వారా ఎదుర్కొంటున్న భారాన్ని తగ్గించాలని, 2011కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, పని దినాలు సరిపోతున్న నేపథ్యంలో రెండవ శనివారం సెలవు ఇవ్వాలని, పరీక్షల విధానంలో మార్పులు చేయకుండా పాత పద్ధతిలోనే పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సిపిఎస్ విధానం రద్దు చేసి ఓపిఎస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కెఎ ఉమామహేశ్వరరావు, జిల్లా కోశాధికారి మరీద్ వరప్రసాద్, బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కర్రా వరప్రసాద్, కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టివి లక్ష్మణస్వామి, పి ప్రసాదరావు, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా జీవి రవిబాబు, జి రాజాబాబు, ఉపాధ్యక్షులుగా తాతా శ్రీనివాస్, నాగ సూర్య కుమారి, కోశాధికారి దాసరి శివప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా సిహెచ్ రత్నకుమారి, ఎం సుజశ్రీ, జ్ఞానానందం, డి కుమార్, బాలసౌరి ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిల్‌కు డి.కృష్ణవేణి, డి బాలసుబ్బమ్మ, పెద్ద మాధవి, జి గోవిందరాజులు, వై పుల్లారావు, రఘుకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బోధనేతర కార్యకలాపాలు ఉపాధ్యాయుల నుండి తొలగించాలని, పిఆర్ సి కమిటీ వేసి తక్షణమే అమలు చేయాలని, అప్పటి వరకు ఐఆర్ అమలు చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని సమావేశంలో తీర్మానించారు.

కల్లాల్లో ధాన్యాన్ని పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-వీరులపాడు : వీరులపాడు మండలం జయంతి గ్రామంలోని ధాన్యం కల్లాలను నందిగామ ఆర్డీవో బాలకష్ణ శుక్రవారం పరిశీలించారు. తుపాను నేపథ్యంలో రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రభుత్వం నిర్ణయించిన తేమ శాతానికి అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పారు. దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవద్దన్నారు. అనంతరం నిర్వహించిన రైతు కోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు చీదిరాల భారత రెడ్డి, తహశీల్దారు రవికుమార్, ఆర్ఐ సంధ్య, వ్యవసాయ శాఖ సహాయకులు అవంతి పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ డివిఆర్ ఏరియా హాస్పిటల్ ప్రాంగణంలో నూతనంగా చేపడుతున్న వంద పడకల ఆసుపత్రి అభివద్ధి పనులను ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిపై అధికారుల నుండి అడిగి తెలుసుకున్నారు. పనులు నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వంద పడకల ఆసుపత్రి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ కమిటీ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఎఎంసి వైస్ చైర్మన్ జ్వాలా, పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : అనారోగ్యంతో బాధపడుతున్న రెడ్డిగూడెంకు చెందిన గుడిపూడి గాయత్రికి అవసరమైన వైద్యచికిత్సను అందించడానికి ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు మంజూరైంది. మైల వరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సిఫారసు మేరకు ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు సంబంధిత చెక్కును ఎమ్మెల్యే కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు జానలపాటి వేణుగోపాలరెడ్డి, సీనియర్ నాయకులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి.. లబ్దిదారురాలి కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డిగూడెం పిఎసిఎస్ అధ్యక్షుడు ఉయ్యూరు సుబ్బారెడ్డి, అన్నేరావుపేట గ్రామ టిడిపి అధ్యక్షులు వేణుబాబు పాల్గొన్నారు.

సకాలంలో పాఠ్యాంశాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-చందర్లపాడు: డిసెంబర్ 5 నాటికి సిలబస్ పూర్తి చేయాలని డైట్ కళాశాల లెక్చరర్ కె.మోహన్ తెలిపారు. తోటరావులపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులను గణితంలో త్రికోణమితిపై పలు ప్రశ్నలు అడిగారు. విద్యా శాఖ ఆదేశాల మేరకు వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకంను పరీక్షించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జి.సుధాకర్, ఉపాధ్యాయులు ఎన్ వెంకటేశ్వర్లు, డి.రాముడు, పిఇటి వేణుబాబు పాల్గొన్నారు.

టిఎల్‌ఎఫ్‌కు కర్లపాటి ట్రస్ట్ వితరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమని కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు సామాజిక వేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మెప్మా కార్యాలయంలో టిఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు నజీమోన్ విజ్ఞప్తి మేరకు రూ.6500 విలువ గల ఇనుప బీరువాను టౌన్ లెవెల్ ఫెడరేషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కర్లపాటి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 లో భాగంగా ఈ వితరణను అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు నజీమూన్, ట్రస్ట్ ప్రతినిధి రాయపూడి వెంకటేశ్వరావు, సిఎంఎం కవిత, వెంకట్, ప్రసాద్, సలీం తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-కంచికచర్ల : డిసెంబర్ 5, 6 తేదీల్లో తిరువూరులో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జి.గోపీ నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం కంచికచర్లలోని ఎన్టీఆర్ జూనియర్ కాలేజీలో మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపీనాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, అప్పులు చేసి కళాశాలకు ఫీజులు కట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ గుడ్ న్యూస్ పేరుతో ట్వీట్లు పెట్టడం తప్ప ఈ విద్య సంవత్సరం ఒక్క రూపాయి కూడా విద్యార్థులకి ఇవ్వలేదన్నారు. ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.15000 తల్లికి వందనం ఇస్తామని ఇప్పుడు దానిగురించి మాట్లాడకపోవడం దారుణమన్నారు. జిఒ 77ను రద్దు చేసి పీజీ చదువుతున్న విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకు నిధులు కేటాయించి నూతన భవనాలు, మౌలిక వసతులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలలో మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణ్‌రావు, రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో ఎస్ఎఫ్ఐ నాయకులు తులసి, వరలక్ష్మి, దీపిక, వరప్రసాద్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సర్పంచుల చెక్ పవర్ రద్దు

ప్రజాశక్తి-జి.కొండూరు: మండలంలోని దుగ్గిరాలపాడు, గంగినేని పాలెం సర్పంచ్‌ల చెక్ పవర్‌ను రద్దు చేస్తూ ఎన్టీఆర్ జిల్లా గ్రామ పంచాయతీ అధికారి నోటీసులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే... సాధారణ నిధులు, 16వ ఆర్థిక సంఘం నిధుల్లో అవకతవకలు జరిగాయంటూ అందిన ఆరోపణలపై జి కొండూరు మండలం దుగ్గిరాలపాడు గ్రామ సర్పంచ్ జడ రాంబాబు, గంగినేని పాలెం సర్పంచ్ పిల్లి రామారావుల చెక్ పవర్‌ను అధికారులు రద్దు చేశారు. నిబంధనలు మేరకు రికార్డును నిర్వహించలేదని, ఖర్చులు కూడా నిబంధనల ప్రకారం ఖర్చు చేయలేదని విచారణలో తెలిసింది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలని ఇద్దరు సర్పంచ్‌లను అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వీరితోపాటు పంచాయతీ కార్యదర్శులు డి రామకృష్ణ, వివేకానందకు కూడా నోటీసులు జారీ అయ్యాయి. మొత్తం దుగ్గిరాలపాడులో రూ.4,87.400, గంగినేని పాలెంలో రూ.5372868 దుర్వినియోగమైనట్లు అధికారులు నోటీసులో పేర్కొన్నారు. ఈ సొమ్ము మొత్తం సర్పంచ్‌లు, కార్యదర్శుల నుండి రికవరీ చేసేందుకు అధికారులు నిర్ణయించారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మానవవనరుల విద్యా కేంద్రంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన పదవ తరగతి స్టడీ మెటీరి యల్‌ను నందిగామ మండల విద్యా శాఖ అధికారి శ్యాంసుందర్ శుక్రవారం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ చదువులో వెనుకబాటున్న విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్ నూరు శాతం ఉత్తీర్ణతకు ఉపకరిస్తుందని తెలిపారు. స్టడీ మెటీరియల్‌ను అన్ని పాఠశాలల విద్యార్థులు ఉపయోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అపర్ణ, రాష్ట్ర ప్రచురణ కమిటీ సభ్యులు ఎన్ .ముత్తయ్య,జిల్లా గౌరవ అధ్యక్షులు మచ్చా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

తారకరామ ఎత్తిపోతలను ఐడిసికి అప్పగించాలి

ప్రజాశక్తి-కొండూరు : మెట్ట ప్రాంతానికి సాగునీటిని అందించే తారకరామా ఎత్తిపోతల పథకాన్ని ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్కు (ఐడిసి) అప్పగించాలని ఆయకట్టు రైతులు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదుకు విజ్ఞప్తి చేశారు. జి.కొండూరులో శుక్రవారం ప్రజాదర్బారులో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కష్ణప్రసాదును కవులూరు, పినపాక గ్రామాల పరిధిలోని తారకరామ లిఫ్ట్ ఇరిగేషన్ ఆయకట్టు రైతులు ప్రత్యేకంగా కలిసి అర్జీని సమర్పించారు. రైతులందరి ప్రయోజనాల నిమిత్తం ఈ పథకాన్ని ఐడీసీలో విలీనం చేసి

తమ గ్రామాలకు మేలు చేయాలని కోరారు. రైతుల అభ్యర్థన మేరకు ఈ విషయాన్ని ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి తగుచర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వసంత కష్ణప్రసాద్ తెలిపారు.

దొంగలు హల్‌చల్

ప్రజాశక్తి-జి.కొండూరు : మండలంలోని చెవుటూరు గ్రామంలో గురువారం రాత్రి దొంగలు హల్చల్ చేశారు. గ్రామంలోని రామాలయం వీధిలో ఉన్న ఓ ఇంటి తాళాలు బద్దలు కొట్టి ఇంట్లోని విలువైన వస్తువలను దొంగిలించారు. అక్కడి నుంచి చెవుటూరు బైపాస్ రోడ్డులో ఉన్న రెండు దుకాణాల తాళాలు పగలగొట్టి రూ.2 వేల నగదు, సిగరెట్ ప్యాకెట్లను దొంగిలించారు. గ్రామంలోని మరో ఇంట్లో తాళాలు కూడా ఇదే మాదిరిగా పగలగొట్టారు. ఉదయం లేచి చూసేసరికి తమ షాపు తాళాలు పగలగొట్టి ఉండటంతో షాపు యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జి కొండూరు ఎస్సై సతీష్ కుమార్ ఘటన స్థలాలకు వెళ్లి ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ పరిసర గ్రామమైన గుంటుపల్లిలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా మెడ్ స్టార్ హాస్పిటల్, షైన్ హాస్పిటల్, హెచ్‌సిజి కాన్సర్ హాస్పిటల్స్, స్రవంతి హాస్పటల్, అమరావతి ఐ హాస్పటల్, వశిష్ట డెంటల్ క్లీనిక్, ఇబ్రహీంపట్నం వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఎన్‌టిటిపిఎస్ ఆధ్వరంలో ఏర్పాటు చేశారు. గుంటుపల్లిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని చీఫ్ ఇంజినీర్ పి. శివ రామాంజనేయులు ప్రారంభించారు. వైద్య శిబిరంలో ఊపిరితిత్తుల పరీక్షలు, ఎలక్ట్రోకార్డియోగ్రాఫ్ పరీక్షలు, ఇకోపరీక్షలు, మధుమేహవ్యాధి పరీక్షలు, శ్వాసకు సంబందించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం యమ్.డి.ఓ. శకుంతల, గుంటుపల్లి గ్రామ సర్పంచ్ కవిత, పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.

దీప్తికి డాక్టరేట్

ప్రజాశక్తి- గంపలగూడెం: ఆధ్యాత్మిక సేవలకు ఫలితంగా కొల్లా దీప్తికి డాక్టరేట్ లభించింది. గంపలగూడెం పట్టణానికి చెందిన దీప్తి పలు సేవా కార్యక్రమాలు చేపట్టినందుకు ఆమెకు ఈ గుర్తింపు లభించింది. న్యూ ఇంటర్నేషనల్ హెూప్ తీయాలిజికల్ యూనివర్సిటీ హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో దీప్తి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ విషయమై తాను సేవా రంగంలో తోడ్పడిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బెస్ట్ ఫార్మసీ టీచర్ అవార్డు గ్రహీతకు నిమ్రా వైస్ చైర్మన్ అభినందనలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: నిమ్రా ఫార్మసీ కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ ఎ.రవికుమార్‌కు ఎంఎన్ఆర్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ నేషనల్ బెస్ట్ ఫార్మసీ టీచర్ అవార్డును ప్రదానం చేసింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన కాంపిటీషన్‌లో అత్యుత్తమ అర్హతలతో రవికుమార్ ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిమ్రా విద్యా సంస్థల వైస్ చైర్మన్ మహమ్మద్ షాదిల్ రసూల్ ఖాన్.. రవికుమార్‌ను శుక్రవారం అభినందించారు. రూ.5వేలు నగదు బహుమతి అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థలు అకాడమీ డైరెక్టర్ డాక్టర్ తమ్మినైనా నారాయణమూర్తి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జనార్ధన్ పాల్గొన్నారు.

టిడిపి కొండపల్లి అధ్యక్షుని ఎంపికలో ఉద్రిక్తత

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: తెలుగుదేశం పార్టీ కొండపల్లి అధ్యక్ష ఎంపిక రసాబాసగా మారింది. సమావేశం జరుగుతుండగానే తెలుగు తమ్ముళ్లు బాహాబాహీకి దిగారు. ఈ సంఘటన శుక్రవారం కొండపల్లి టిడిపి కార్యాలయంలో జరిగింది. తెలుగుదేశం పార్టీ కొండపల్లి అధ్యక్ష ఎంపిక కార్యక్రమం కొండపల్లి టిడిపి కార్యాలయంలో నిర్వహించారు. గత కొద్ది కాలంగా టిడిపి అధ్యక్ష పదవి రేస్‌లో తెలుగు తమ్ముళ్లు పోటీ పడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని పార్టీ నాయకులు అధ్యక్షుని ఎంపిక వాయిదా వేస్తూ వచ్చారు. కొండపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు కొండపల్లి మున్సిపాలిటీ టిడిపి అధ్యక్షుడిగా

కొనసాగుతున్నారు. అధ్యక్ష పదవి ఎంపిక క్రమంలో ప్రతిపాదనలు పెట్టగా, ప్రతిపాదనపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో తెలుగు తమ్ముళ్ల మధ్య వాగ్వాదం పెరిగి, బాహబాహికి దిగారు. మున్సిపాలిటీ పదవి దక్కదనే అక్కసుతో మాజీ అధ్యక్షుడే గొడవ సృష్టించారని ఒక గ్రూపు ఆరోపిస్తుండగా, పార్టీలో నామమాత్రంగా పనిచేసిన వారికి పదవుల ఎలా ఇస్తారంటూ ప్రశ్నించినట్టు మరో వర్గం ఆరోపిస్తుంది. స్వార్థం కోసం పార్టీ పరువు బజారుకు ఈడుస్తున్నారని పార్టీ కార్యకర్తల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎంపిక ప్రక్రియను మరల నిర్వహిస్తామని నాయకులు నిలిపివేశారు.

వైసిపి నేత వెంకట్రావుకు పరామర్శ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: వైసిపి సీనియర్ నాయకులు పాటిబండ్ల వెంకట్రారావును జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి వారిని పరామర్శించారు. వెంకట్రారావు కొంతకాలంగా అనారోగ్య కారణంగా బాధపడుతున్నారు. విషయం తెలుసుకొన్న తన్నీరు నాగేశ్వరరావు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయనతోపాటు పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నరసింహారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి వెంకటరమణ, తదితరులు పరామర్శించారు.

బాధితులకు చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్. కుటుంబ సభ్యుల్లో అనారోగ్యం పాలై ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఉపశమన పథకం నిధులు అండగా నిలుస్తున్నాయని మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాల సౌరి పేర్కొన్నారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు మచిలీపట్నం క్యాంప్ కార్యాలయంలో ఎంపీ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, మాదివాడ రాము, పాగోలు గ్రామం నుంచి మేక సత్యనారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ వలలో ఉద్యోగి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: ఆర్బిఐ, పోలీసు వ్యవస్థ సైబర్ నేరాల పట్ల ప్రజలలో ఎంతో చైతన్యం కలిగించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుని ఆర్థికంగా నష్టపోతున్నారు. మచిలీపట్నం లక్ష్మీ టాకీస్ సెంటర్లో నివాసముంటున్న ఓ సాఫ్ట్వేర్ మహిళ సైబర్ మోసగాళ్ల బారినపడి దాదాపు 8 లక్షల 15 వేల రూపాయలు పోగొట్టుకుంది. బాధిత మహిళ మచిలీపట్నం చిలకలపూడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

7న మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష డిసెంబర్ 7న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి పీవీజే రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టికెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం వెబ్‌సైట్ www.bse.ap.gov.in పాఠశాల లాగిన్ ద్వారా, అలాగే వాట్సాప్ యాప్‌లోని మన మిత్రలో ఉంచినట్లు తెలిపారు. విద్యార్థుల వివరాల్లో ఏవైనా సవరింపులు ఉంటే, ప్రధానోపాధ్యాయులు ధృవీకరించిన లేఖను పరీక్ష కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్‌కి అందజేసి సెంటర్ నామినల్ రోల్‌లో నమోదు చేయించుకోవాలని అన్నారు. హాల్‌టికెట్‌లో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడంతో పరీక్ష కేంద్ర వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: ప్రజలందరికీ స్వచ్ఛమైన నీరు, స్వచ్ఛమైన గాలి ఎంతో అవసరమని మచిలీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి ఉమ్మడి కృష్ణాజిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం నగర పరిధిలోని 50 వ డివిజన్లో ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చలమలశెట్టి రమేష్, టిడిపి క్లస్టర్ ఇంచార్జి పల్లపాటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాటర్ ప్లాంట్ నిర్వాహకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు శుద్ధమైన మంచినీటిని అందిస్తామన్నారు.

ఎస్‌సి, బిసి ప్రాంతాల్లో మౌలిక వసతులకు కృషి : ఎంపి

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఎస్‌సి, బిసి నివాస ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. అవనిగడ్డ ఎనిమిదో వార్డు లోని నేరేళ్లపాలెం బస్ స్టాప్ వద్ద నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ సిఎస్ఆర్ నిధులు రూ 65 లక్షలతో రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్ట్ పర్యవేక్షణలో నూతనంగా నిర్మించిన మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం శుక్రవారం జరిగింది. ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ విచ్చేసి ఈ నూతన భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల సిఎస్ఆర్ నిధులతో విస్తృతంగా కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. త్వరలో మరిన్ని భవనాలు నిర్మిస్తామని బాలశౌరి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్ రామ్, డీసీఎంసీ ఛైర్మన్ బండి రామకష్ణ, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవన బోయిన వెంకటేశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్ట్ ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే

రూ.80 లక్షలతో వంతెన ప్రారంభం

ప్రజాశక్తి-నాగాయలంక: బర్రంకుల గ్రామంలో ఎంపి నిధులు రూ.80 లక్షలతో బర్రంకుల-గణపేశ్వరం మధ్య మంగలేరు మీడియం డ్రైనేజీపై నిర్మించిన వంతెనను ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, డీసీ ఛైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు (చినబాబు), గణపేశ్వరం గ్రామ సర్పంచ్ బెల్లంకొండ శ్రీనివాసరావు, పీఏసీఎస్ ఛైర్మన్ తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

11,141 టన్నుల ధాన్యం కొనుగోలు : మండలి

ప్రజాశక్తి-చల్లపల్లి

నియోజకవర్గంలో ఇప్పటివరకు 11,141 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.26,39,63,713లు చెల్లించినట్లు అవనిగడ్డ నియోజవర్గ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన చల్లపల్లిలో ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో జాతీయ రహదారిపై ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులతో మాట్లాడి ధాన్యం విక్రయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చల్లపల్లి మండలంలో 2,622 మెట్రిక్ టన్నులు, ఘంటసాల మండలంలో 5,664 మెట్రిక్ టన్నులు, మోపిదేవి మండలంలో 2,565 మెట్రిక్ టన్నులు, నాగాయలంక మండలంలో 45 మెట్రిక్ టన్నులు, కోడూరు మండలంలో 245 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగస్వాములు అయిన సహకార సంఘాల ఛైర్మన్లు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ప్రతి రైతుకు మేలు చేయటమే ధ్యేయంగా కషి చేస్తున్నట్లు తెలిపారు. వాతావరణ పరిస్థితి నేపథ్యంలో ఆరబెట్టిన ధాన్యం మిల్లులకు తరలించే ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ పాల్గొన్నారు.

అబ్బురపరిచిన సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్: విద్యార్థుల్లో వచ్చే నూతన ఆలోచనలు నూతన ఆవిష్కరణకు దారి తీస్తాయని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీ మహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. స్థానిక పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయాలో సైన్స్ ఎగ్జిబిషన్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 100కు పైగా నూతన ఆలోచనలతో రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో సహజ వనరుల పునరుద్ధరణ, సౌకర్యవంతమైన జీవనం కోసం అవసరమైన పలు ఆలోచనలను ప్రాజెక్టు రూపంలో విద్యార్థులు ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోనస్ పంపిణీ

ప్రజాశక్తి-ఉంగుటూరు (బాపులపాడు): పదవులు కాకుండా ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన ఎజెండా అని గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శుక్రవారం కాకులపాడు గ్రామంలో జరిగిన సహకార సంఘ బోనస్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని 694 మంది సభ్యులకు రూ.25.95 లక్షల బోనస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఏఎంసీ ఛైర్మన్ గూడవల్లి నరసింహారావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, పిఎస్సీఎస్ అధ్యక్షులు యజ్జవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలపై అవగాహన

ప్రజాశక్తి-ఘంటసాల: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు తొందరపడి పక్వానికి రాకుండా వరి పంటను కోయరాదని మండల వ్యవసాయ శాఖాధికారి డి.అనూష తెలిపారు. కొడాలిలో రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించి రైతులతో మాట్లాడారు. పక్వానికి రాని వరి కోతలు కోయటం వల్ల రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. హడావిడిగా యంత్రాలతో కోతలు కోస్తున్నారని, తేమ శాతం అధికంగా ఉంటే రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. వ్యవసాయశాఖ సూచనలు పాటించి వాతావరణ పరిస్థితి మారే వరకు కోతలు వాయిదా వేసుకోవాలని తెలిపారు.

పోస్టల్ ఉద్యోగులకు అవార్డులు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం డివిజన్ ఆధ్వర్యంలో కష్ణా విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో పోస్టల్ ఉద్యోగులు, ఏజెంట్లకు ఎక్స్‌లెన్స్ అవార్డ్స్, బీమా సంకల్ప్ మెగా డ్రైవ్ అవార్డ్స్‌ను శుక్రవారం ప్రధానం చేశారు. డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ కె. సంతోష్ నేత జ్యోతిప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి విజేతలకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీనివాసరావు, టి.నాగరాజు, జి.వి.బెనర్జీ, కె.వి.కిరణ్ కుమార్ పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్‌ను సందర్శించిన 'అప్స' బృందం

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం): బడ్జెట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్స) ఎల్లప్పుడూ ముందుంటుందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుబ్రహ్మణ్య రాజు అన్నారు. 'హలో మిత్రమా, ఎలా ఉన్నారు?' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కార్యవర్గం గన్నవరం పరిసరాల్లోని పాఠశాలలను రెండు రోజుల పర్యటనలో బాగంగా శుక్రవారం ముస్తాబాద నవభారత్ హైస్కూల్ ను రాష్ట్ర కార్యవర్గం సందర్శించింది. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్య రాజు మాట్లాడుతూ చిన్న విద్యాసంస్థలను సందర్శించి, వాటి యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలు విని, వాటిని ప్రభుత్వానికి తెలియజేసే లక్ష్యంతో ఈ పర్యటన చేస్తున్నామని ప్రస్తుతం రాష్ట్రంలో పదవ తరగతి నామినల్ రోల్స్ పంపే విషయంలో మేము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ చైర్పర్సన్ సుందర్‌రామ్, రవీంద్రబాబు, రామచంద్రారెడ్డి, ఎం.జనార్దన్, మాణిక్యాల రావు, రామకృష్ణారెడ్డి, ఐ.గణపతిరావు, తమ్మినేని సింహాచలం, ఎం. శ్రీహరి రావు, బి. గణేష్ బాబు, గోన సాంబశివ రావు, ఆరుమళ్ళ మోహన్‌రెడ్డి, షేక్ ఇమామ్, తాళ్లూరి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, జయప్రకాష్, రాధాకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, కరస్పాండెంట్ షేక్ జాకీర్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గుడివాడ బాలోత్సవం

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ, గుడివాడ పరిసర ప్రాంతాలలోని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 29, 30వ తేదీల్లో జరిగే బాలోత్సవం ఎంతగానో ఉపయోగపడుతుందని కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సనకా సుబ్బారావు, నున్న ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ బాలోత్సవ కార్యక్రమంలో 10 అకాడమిక్ ఈవెంట్స్, 10 కల్చరల్ ఈవెంట్స్ తో పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈనెల 29వ తేదీన ఉదయం 9:30 గంటలకు గుడివాడ మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గుడివాడ బాలోత్సవం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని గుడివాడ ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ గాయత్రి ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ వరలక్ష్మి, కష్ణ కిషోర్, నర మహేష్, కురుమద్దాలి సుధాకర్, నందమూరి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టాభి స్మారక భవనం నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనం మచిలీపట్నంలో నిర్మించి తీరుతామని పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలసౌరి పేర్కొన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పివీ ఫణికుమార్ పట్టాభి స్మారక భవన నిర్మాణంపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ త్వరలో పట్టాభి స్మారక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు మోపర్తి సుబ్రమణ్యం, కానుకొలను ఫణి కిరణ్ శర్మ, వేమూరి నాగ సాయి, నిమ్మగడ్డ శ్రీధర్, కృష్ణయ్య, మాదివాడ రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు టైలరింగ్ శిక్షణ

ప్రజాశక్తి-మొవ్వ: మహిళా విద్యార్థుల్లో స్వయం ఉపాధి నైపుణ్యాలను అభివృద్ధి చేసే దిశగా టైలరింగ్‌లో ప్రాక్టికల్ శిక్షణ" శిక్షణా కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ మాధవి అధ్యక్షతన జరిగింది. పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా శిక్షణను ప్రారంభించి మాట్లాడుతూ మహిళా విద్యార్థులకు టైలరింగ్‌లో అనుభవపూర్వక మరియు మార్కెట్‌లో ఉపయోగపడే నైపుణ్యాలను అందించడానికి రూపొందించబడిందని,. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులకు ఉద్యోగావకాశాలు, స్వయం ఉపాధి అవకాశాలు, మరియు ఉద్యమిత్వ సామర్థ్యాలు మరింత మెరుగుపడేలా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొవ్వ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వర రావు, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ వేమూరి పరిశుద్ధ రాజు, ఎంపీడీవో డి.సుహాసిని, బ్యాంకు విశ్రాంతి ఉద్యోగి మండవ కోటేశ్వరరావు, నీటి వినియోగదారుల సంఘ అధ్యక్షులు తాతినేని పూర్ణచంద్రరావు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ పి శ్రీకాంత్ పాల్గొన్నారు.

డ్రైన్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కంకిపాడు: యనమనకుదురు శివలింగేశ్వర నగర్ శేషమాంబ ఆశ్రమం దగ్గర డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం నాయకులు తెలిపారు. ఈ క్రమంలో డ్రైన్లు నిర్మించాలని కోరుతూ స్థానికుల నుంచి శుక్రవారం సంతకాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాసిం, మహిళా సంఘం నాయకులు లక్ష్మి, జయమ్మ, రత్నకుమారి, శ్రీదేవి, నాంచారయ్య పాల్గొన్నారు.

కొమ్మారెడ్డి విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-బంటుమిల్లి: ఈ నెల 7న మన సంస్కృతి ఆర్గనైజేషన్ నిర్వహించిన హిందీ ప్రతిభా పరీక్షలో కొమ్మారెడ్డి స్కూల్ విద్యార్థిని యస్.కె.అఫ్షా పర్వీన్ (7 తరగతి) జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, కరెస్పాండెంట్ శోభ, కొమ్మారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కొమ్మారెడ్డి చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ హరిణి, ఎన్.శ్రీనివాసరావు అభినందించారు.

కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం

- మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్
- యూనియన్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ప్రవీణ్, జ్యోతిబసు

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నగర నూతన కమిటీ 56 మందితో ఏర్పడింది. స్థానిక బాలోత్సవ్ భవన్‌లో గురువారం యూనియన్ 11వ మహాసభ జరిగిన విషయం తెలిసిందే. నగర నూతన కమిటీ చేసిన తీర్మానాలను బాలోత్సవ్ భవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ వెల్లడించారు. యూనియన్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా టి ప్రవీణ్, ఎన్ జ్యోతిబసు, కోశాధికారిగా టి.చిన్న ఎన్నిక కాగా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జె.విజయలక్ష్మి, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా టి.తిరుపతమ్మ, డి.స్టీఫెన్ బాబు, ఉపాధ్యక్షులుగా ఏ.బుజ్జమ్మ, జి.మహేష్, ఆదిశేషు, కార్యదర్శులుగా బి.బ్రహ్మయ్య, వై.దుర్గాప్రసాద్, వి.కుమారి, కృష్ణవేణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాసభ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. ప్రజారోగ్య విభాగంలో పెరిగిన పని భారానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, అలాగే ఉద్యానవన విభాగంలో కూడా కార్మికుల సంఖ్యను పెంచాలని తీర్మానించారు. వాటర్ అండ్ డ్రైనేజీ సెక్షన్‌లో మూడు షిఫ్టుల విధానాన్ని అమలు చేసి, సర్కిల్‌కు 50 మంది చొప్పున 150 మంది కార్మికులను భర్తీ చేయాలని, పరికరాలు ఇవ్వాలని తెలిపారు. ఎస్‌టిపిఐ, డిపి స్టేషన్‌లో కూడా సిఎల్‌లు, పండగ సెలవులు ఇవ్వాలని, అలాగే మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి ప్రమోషన్లు కల్పించాలని, పెరిగిన ధరలకనుగుణంగా 12వ పిఆర్‌సిని వెంటనే వెల్లడించాలని, ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమ్మె కాలం జీతం ఇవ్వాలని మహాసభ కోరింది. వెహికల్ డిపోలోని హెల్పర్లను మెకానికల్‌గా ప్రమోట్ చేయాలని, మెకానిక్ సెక్షన్ విభాగాన్ని హెల్త్ సెక్షన్లో కలపాలని మహా సభ తీర్మానించింది. అటెండర్ సెక్షన్‌లో ఉన్న కార్మికుల చదువు రీత్యా వారిని బిల్ కలెక్టర్లుగా ప్రమోట్ చేయాలని, మస్టర్ పాయింట్స్‌లో మరుగుదొడ్డి సదుపాయం కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని తీర్మానించినట్లు కాశీనాథ్ తెలిపారు. 11వ నగర మహాసభకు నగరపాలక సంస్థలో ఉన్న అన్ని సెక్షన్ల విభాగాల నుండి మహాసభకు ప్రతినిధులు హాజరయ్యారు. నగరంలోని మూడు సర్కిళ్లకు వేర్వేరుగా నూతన కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దోనేపూడి కాశీనాథ్

ఘనంగా ఎంబిఎ విద్యార్థుల 'కురుక్షేత్ర'

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థులు సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా స్పష్టమైన లక్ష్యాలతో, మెరుగైన నైపుణ్యాలతో పటిష్టంగా భవిష్యత్తును నిర్మించు కోవాలని ఐఎంఐఎస్ ఫార్మాస్యూటికల్స్ మేనేజింగ్ డైరెక్టర్, భారత పరిశ్రమల సమాఖ్య (సి.ఐ.ఐ.) విజయవాడ జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ వి.నాగలక్ష్మి అన్నారు. శుక్రవారం పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, సిద్ధార్థ మేనేజ్ మెంట్ క్లబ్ సంయుక్తంగా ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మేనేజ్‌మెంట్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమం కురుక్షేత్రను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంతటా అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, అయితే యువతలో అనుకూలత, సంసిద్ధత లోపిస్తోందన్నారు. కార్పొరేట్ రంగంలో మహిళల స్థానం బలపడుతోందని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేశ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సజనాత్మకత, నైపుణ్యాల పెంపునకు ఈ తరహా పోటీలు అవసరమని చెప్పారు. ఆచార్య రాజేశ్ సి.జంపాల మాట్లాడుతూ గత 3 దశాబ్దాలుగా విజయవంతంగా కురుక్షేత్ర నిర్వహిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. సమన్వయకర్త, సీనియర్ అధ్యాపకులు రెహమాన్ మాట్లాడుతూ బిజినెస్ క్విజ్, స్టాక్ మార్కెట్ సిమ్యులేషన్, మార్కెట్ మేకర్స్, బిడ్డింగ్ యంగ్ మేనేజర్, హెచ్.ఆర్. రోల్, బిజినెస్ ఐడియాస్ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి దాదాపు 400 మంది ఎంబిఎ విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

లైఫ్ స్కిల్స్‌పై శిక్షణ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్ తన ఫ్లాగ్‌షిప్ 'శామ్‌సంగ్ డిజిటల్ అండ్ ఆఫ్‌లైన్ స్కిల్స్ ట్రెనింగ్ (దోస్త్) 'సెల్స్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సంస్థ ఇంచార్జి ఎస్.ప్రతాప్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. తక్కువ సేవలు అందే కమ్యూనిటీలకు చెందిన 9,400 మంది యువతకు ఫ్రంట్‌లైన్ రిటైల్ పాత్రల కోసం శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. నైపుణ్యం కలిగిన, భవిష్యత్తు సిద్ధంగా ఉన్న శ్రామిక వర్గాన్ని తీర్చిదిద్దడం ద్వారా సమ్మిళిత ఆర్థిక వృద్ధి లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లాలన్న శామ్‌సంగ్ నిబద్ధతను ఈ విస్తరణ మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. ఈ సంవత్సరం ప్రారంభమైన దోస్త్ సెల్స్ 4.0తో ఎలక్ట్రానిక్స్ సెక్టార్ స్కిల్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, టెలికాం సెక్టార్ స్కిల్స్ కౌన్సిల్ భాగస్వామ్యంతో శామ్‌సంగ్ తన స్కిల్లింగ్ మిషన్‌ను రెట్టింపు చేస్తోందని తెలిపారు.

పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి- నందిగామ : ఉద్యోగుల పిఆర్‌సి కమిషన్ వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలని యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నందిగామ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం రాత్రి చందర్లపాడు మండల నూతన కౌన్సిల్ సమావేశం జరిగింది. రాష్ట్ర కౌన్సిలర్ గంగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుందరయ్య మాట్లాడుతూ ఉద్యోగుల ఆర్థిక బకాయిలను చెల్లించడానికి రోడ్డు మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీన్ని ఎన్నుకున్నారు. యుటిఎఫ్ చందర్లపాడు మండల అధ్యక్షునిగా పి రామారావు, ప్రధాన కార్యదర్శిగా బి సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులుగా జి సత్యనారాయణ, ఎస్.సువర్చల, కోశాధికారిగా సిహెచ్ మధుబాబు, మండల ఆడిటర్‌గా శివ నాగేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్స్‌గా సిహెచ్ శ్రీలక్ష్మి, జై గంగరాజు, టి వెంకటాద్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా సహాధ్యక్షులు ఎం కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి బి రమణయ్య , జిల్లా ఆడిట్ కన్వీనర్ మహేశ్వర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఎఐ దోహదం

- బ్రైడిజిటల్ ఎఐ 5.0 సదస్సులో కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-విజయవాడ : మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) అవకాశాలను మెరుగుపరుస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. శుక్రవారం విజయవాడ జిఆర్‌టి హోటల్లో అసోసియేషన్ ఆఫ్ లేడీ ఆంత్రప్రెన్యూర్స్ (అలెప్), సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిపిఐ) సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన బ్రైడిజిటల్ ఎఐ 5.0 సదస్సులో వివిధ పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు, విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, స్టార్టప్ యువ బృందాలు, విద్యార్థులతో కలిసి కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యం విద్యా సంస్థలు (అకడమియా), స్టార్టప్స్, పరిశ్రమల మధ్య సహకారాన్ని ప్రోత్సహించడమని చెప్పారు. ఇండియా ఎఐ మిషన్, కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత మంత్రిత్వశాఖ హబ్ లక్ష్యాలను చేరుకునేందుకు ఇలాంటి సదస్సులు దోహదం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమం బిజినెస్ టు బిజినెస్ (బి2బి), బిజినెస్ టు గవర్నమెంట్ (బి2జి) నెట్‌వర్కింగ్‌కు ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాలకు చెందిన ఉపకులపతులు, స్టార్టప్ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొనడం అభినందనీయ మన్నారు. సదస్సు సందర్భంగా లబ్ధిదారులైన 40 స్టార్టప్‌లు తమ వ్యాపార నమూనాలు, ఉత్పత్తులు, ఆవిష్కరణలను ప్రదర్శించాయి. ఈ కార్యక్రమంలో అలెప్ అధ్యక్షురాలు సి.రమాదేవి, ఉపాధ్యక్షురాలు స్వరూపారాణి, ఎస్‌టిపిఐ డైరెక్టర్ కవిత, అలెప్ ప్రతినిధులు, డిఆర్‌డిఎ పిడి ఎన్‌వి నాంచారరావు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

1 నుండి ఇగ్నో పరీక్షలు

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) నిర్వహించే డిసెంబర్ 2025 టర్మ్ ఎండ్ పరీక్షలు డిసెంబర్ 1, 2025 నుండి జనవరి 14, 2026 వరకు జరుగుతాయని ఇగ్నో ప్రాంతీయకేంద్రం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కె.సుమలత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ ప్రాంతీయకేంద్రం పరిధిలో 6 పరీక్ష కేంద్రాలను విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూల్, అనంతపురంలలో ఏర్పాటు చేశామన్నారు. అర్హులైన అభ్యర్థులందరికీ హాల్ టికెట్లు ఇగ్నో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హాల్ టికెట్లను ఇగ్నో విశ్వవిద్యాలయపు వెబ్‌సైట్ www.ignou.ac.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలో గల ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా/ ఈ మెయిల్ ద్వారా గాని లేదా 0866-2565253 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రతించవచ్చని తెలియచేశారు.

ప్రైవేటు పాఠశాలల గుర్తింపును పొడిగించాలి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : పదవ తరగతి నామినల్ రోల్స్ సబ్మిట్ చేసే విధానాన్ని సరళీకతం చేయాలని ఏపి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి.సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును పది సంవత్సరాల నుంచి మరో రెండు సంవత్సరాలకు పెంచాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఏపి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని ప్రైవేట్ స్కూళ్లను సందర్శించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే కార్యక్రమంలో భాగంగా 'హలో మిత్రమా ఎలా ఉన్నారు' కార్యక్రమం సింగ్‌నగర్‌లోని శ్రీరామ్ పాఠశాలలో శుక్రవారం చేపట్టింది. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు పాఠశాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గాన్ని శ్రీరామ్ పాఠశాల కరస్పాండెంట్ బోనీ సురేష్ సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎల్‌కెజి, నర్సరీ, యుకెజి గుర్తింపుకు గైడ్‌లైన్స్ తక్షణమే విడుదల చేయాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ ప్రతి మూడు సంవత్సరాలకు ఎన్‌ఓసి ఇస్తున్నారని దానిని ఐదు సంవత్సరాలకు పొడిగించాలని డిమాండ్ చేశారు. సింగిల్ విండో సిస్టంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి ఎడ్యుకేషన్ సొసైటీ లకు ఒక్కసారే రెన్యువల్ చేసుకునే విధంగా అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎం జనార్ధన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని సింహాచలం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్ మాణిక్యాలరావు రాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ గణపతి రావు, అసోసియేషన్ ప్రతినిధులు మోహన్ రెడ్డి శ్రీహరి రావు మల్లికార్జునరావు, రామకృష్ణారెడ్డి రవిచంద్ర సుందర్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో జిజిహెచ్ అభివృద్ధి

- ఎంపి కేశినేని శివనాథ్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : విజయవాడ జనరల్ ఆసుపత్రికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చే విధంగా అభివృద్ధి చేస్తామని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో శుక్రవారం జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, కామినేని శ్రీనివాస్, ఎపిడి.ఎమ్.ఈ డాక్టర్ జి.రఘునందం అతిథులుగా పాల్గొన్నారు. విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజ్ పూర్వ విద్యార్థులైన డాక్టర్ యలమంచిలి హైమావతి, డాక్టర్ రాజారావు బహూకరించిన బస్సును ఎంపి శివనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య రంగంలో విశిష్ట సేవలందిస్తున్న డాక్టర్ వై.రాజారావును ఘనంగా సన్మానించారు. కాలేజీకి బస్సు బహూకరించిన డాక్టర్ యలమంచిలి హైమావతి, డాక్టర్ రాజారావులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ మెడికల్ కాలేజీ, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కోసం ప్రతి నెల ఎమ్మెల్యేలు బొండా ఉమా, గద్దె రామ్మోహన్‌లతో కలిసి పరిశీలన చేయాలని ప్రణాళిక చేసుకున్నట్లు తెలిపారు. విజయవాడ జిజిహెచ్‌లోని రేడియాలజీ విభాగంలో క్యాన్సర్ చికిత్సకు సంబంధించిన 'లినాక్ పరికరం తెప్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా మెడికల్ కాలేజీలోని పి.జి హాస్టల్ బిల్డింగ్స్, నర్సింగ్ కాలేజీ హాస్టల్ బిల్డింగ్స్ నిర్మాణానికి అవసరమైన రూ.80 కోట్ల నిధుల కోసం కృషి చేస్తున్నామని, త్వరలోనే ఆ భవనాల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ చదివిన కాలేజీ అభివృద్ధికి తోడ్పాడు ఇవ్వటం ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ మెడికల్ కాలేజీ అల్యూమిని ప్రెసిడెంట్ డాక్టర్.ఎస్.శ్రీనివాసరావు, సెక్రటరీ డాక్టర్ అమ్మన్న, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్. వై.వి.వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.